విశాలాంధ్ర
→ విశాఖపట్నం
→ అనకాపల్లి
→ అల్లూరి సీతారామరాజు

1న ఇనార్బిట్ మాల్‌కు సీఎం శంకుస్థాపన

ఏర్పాట్లను పరిశీలించిన మంత్రి అమర్నాథ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: పోర్ట్ హాస్పటల్ సమీపంలో సుమారు 600 కోట్ల రూపాయలతో నిర్మించనున్న రహేజా గ్రూపునకు చెందిన ఇనార్బిట్ మాల్‌కు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఆగస్టు ఒకటో తేదీన శంకుస్థాపన చేయనున్నారు. దీనికి సంబంధించిన ఏర్పాట్లను రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ శుక్రవారం పరిశీలించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ సుమారు 17 ఎకరాలలో నిర్మించనున్న ఈ ఇనార్బిట్ మాల్ రెండు తెలుగు రాష్ట్రాల్లో అతి పెద్దదని చెప్పారు. ఇందులో సుమారు 200కు పైగా మాల్స్ ఉంటాయని, దీనికి అవసరమైన ప్రభుత్వాల అనుమతులన్నీ ఇప్పటికే రహేజా యాజమాన్యం తీసుకుందని చెప్పారు. ఈ మాల్‌లో సుమారు 5,000 మందికి ప్రత్యక్షంగానూ, పరోక్షంగానూ ఉపాధి అవకాశాలు లభిస్తాయని మంత్రి అమర్నాథ్ వెల్లడించారు. 24 నెలల్లో ఈ మాల్ నిర్మాణం పూర్తి అవుతుందని ఆయన తెలియజేశారు. మంత్రి అమర్నాథ్ వెంట వైసీపీ ఉత్తర నియోజకవర్గం ఇన్చార్జి కేకే రాజు, డిసిసిబి చైర్మన్ కోలా గురువులు, కార్పొరేటర్లు బాణాల శీను, హనూక్ తదితరులు ఉన్నారు.

శాశ్వత ఈఓ లేక గాడి తప్పిన పాలన

విశాలాంధ్ర - సింహాచలం: ఉత్తరాంధ్ర ఆరాధ్య దైవం శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామి వారి దేవస్థానంకు పెద్దదిక్కు (శాశ్వత ఈఓ) లేకుండా పోయింది. కార్యనిర్వహణాధికారుల (ఈవో)ను తరచూ మార్చు తుండడంతో పాలన పూర్తిగా గాడి తప్పిందని స్థానికులు, భక్తులు అంటున్నారు. దీంతో సిబ్బంది ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారనే గుసగుసలు వినిపిస్తున్నాయి. 2013 మార్చి 2 నుంచి 2019 ఆగస్టు 18 వరకు సుమారు ఆరున్నరేళ్ల పాటు ఇక్కడ ఈవోగా పనిచేసిన కోడూరి రామచంద్ర మోహన్ పదోన్నతిపై అదనపు కమిషనర్‌గా వెళ్లినప్పటి నుండి నేటి వరకూ ఏడుగురు ఈవోలు మారారు. ఫలితంగా దేవస్థానం పరిధిలో అభివృద్ధి పనులు కుంటుపడగా, భక్తులకు కల్పించాల్సిన కనీస మౌలిక వసతులపై ప్రభావం పడుతోంది. ఈవో రామచంద్ర మోహన్ తరువాత రెవెన్యూకు చెందిన మారెళ్ల వెంకటేశ్వరరావు 2019 ఆగస్టు 18 నుంచి 2020 జూన్ 10 వరకు ఇన్‌చార్జి బాధ్యతలు నిర్వహించారు. ఆ తరువాత ఆర్జేసీ దర్భముళ్ల భ్రమరాంబ 2020 సెప్టెంబరు 2 వరకు, అనంతరం అన్నవరం ఈవో వాండ్ర త్రినాథరావు 2021 జనవరి 22 వరకు పనిచేయగా, రెవెన్యూకు చెందిన దిమిలి వెంకటేశ్వరరావు మార్చి 4, 2021 వరకు ఈవోగా వ్యవహరించారు. ఆ తరువాత మరో రెవెన్యూ అధికారి ఎంవీ సూర్యకళ సింహాచలం ఈఓగా ఇన్‌చార్జి బాధ్యతలు స్వీకరించి 2022 ఆగస్టు 2 వరకు పనిచేశారు. ఆమె బదిలీ అనంతరం మళ్లీ భ్రమరాంబ సెప్టెంబరు 21 వరకు ఉన్నారు. ఆ తరువాత ద్వారకా తిరుమల దేవస్థానం ఈవోగా పనిచేస్తున్న వాండ్ర త్రినాథరావుకు మళ్లీ ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించారు. గత మూడున్నరేళ్లలో తాజా నియామకంతో ఏడుగురు ఈవోలు మారినట్టయింది. అయితే ఈవో త్రినాథరావు ఇక్కడ బాధ్యతలు చేపట్టినప్పటి నుంచి కేవలం పదిసార్లు మాత్రమే దేవస్థానంలో కనిపించారు. అత్యవసరంగా పరిశీలించాల్సిన దస్త్రాలను ఇక్కడి సిబ్బంది ద్వారకా తిరుమలకు తీసుకువెళ్లి సంతకాలు తీసుకోవాల్సి వస్తోంది.

31న కార్మిక సమాహార సభ

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: విశాఖ ఉక్కు ప్రైవేటీకరణను వ్యతిరేకిస్తూ కార్మికులు చేపట్టిన రిలే నిరాహార దీక్షలు 900వ రోజుకు చేరుకోనున్న సందర్భంగా విశాఖ ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 31న నిర్వహిచనున్న కార్మిక సమాహార సభను జయప్రదం చేయాలని నేతలు పిలుపునిచ్చారు. ప్రాణాల్ని త్యాగం చేసి తెచ్చుకున్న విశాఖ ఉక్కును ప్రైవేట్ వ్యక్తుల చేతుల్లో పెడితే సహించబోమని అన్నారు. ఈ నెల 30న నిర్వాసిత కాలనీలు, కూర్మన్నపాలెం, ఉక్కునగరం ప్రాంతాల్లో పాదయాత్ర నిర్వహించనున్నట్లు తెలిపారు. 31న సాయంత్రం 4గంటలకు కూర్మన్నపాలెం శిబిరం వద్ద కార్మిక సమాహార సభ నిర్వహించనున్నట్లు తెలిపారు.

నరసాయమ్మకు సీపీఐ నేతల పరామర్శ

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఇటీవల అనారోగ్యానికి గురైన కమ్యూనిస్ట్ పార్టీ మహిళా నాయకురాలు యేల్లెటి నరసాయమ్మను పెదగంట్యాడలోని ఆమె స్వగృహంలో శుక్రవారం సీపీఐ జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు, గాజువాక నియోజక వర్గ సీపీఐ కార్యదర్శి కసిరెడ్డి సత్యనారాయణ, నాయకులు పెదపూడి దుర్గారావు, జి.ఆనంద్, అప్పారీ విష్ణుమూర్తి పరామర్శించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యదర్శి ఎం.పైడిరాజు మాట్లాడుతూ నరసాయమ్మ త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఈమె భర్త స్వర్గీయ యేల్లేటి రామారావు సిపిఐ పార్టీ రాష్ట్ర నాయకులుగా పనిచేసి గాజువాక ప్రథమ పురపాలక సంఘం 18వ వార్డు కౌన్సిలర్‌గా ప్రజలకు సేవలందించారన్నారు. ఈ కుటుంబం ఇప్పటికి సిపిఐ పార్టీ భావజాలాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లి పార్టీ సిద్ధాంతాలకు అనుగుణంగా పనిచేస్తున్నారని అన్నారు. ఈమె పెద్ద కుమారుడు యేల్లేటి శ్రీనివాసరావు పెదగంట్యాడ సిపిఐ పార్టీ కార్యదర్శిగా, విశాఖ నగర సమితి సభ్యులుగా పార్టీకి సేవలందిచడం అభినందనీయమని అన్నారు.

సీతారాముల ఆలయానికి రూ.20 వేల విరాళం

విశాలాంధ్ర - వి.మాడుగుల: మాడుగులలోని కొబ్బరితోట వీధిలో గల సీతా రాములస్వామి ఆలయ ఆవరణలో గల ఫ్లోరింగ్ నిమిత్తం మాడుగుల నియోజక వర్గ టీడీపీ నాయకులు పైలా ప్రసాదరావు 20 వేల రూపాయలు ఆర్థిక సహాయంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో అల్లూరి సీతారామరాజు యూత్ క్లబ్ అధ్యక్షులు మండల సతీష్, మాజీ పిఎసిఎస్ అధ్యక్షులు పుట్టా మురళి, పుట్టా బలరాం, మాడుగుల టీడీపీ పార్టీ ప్రెసిడెంట్ వద్దాది రంజిత్ వర్మ, టీడీపీ నాయకులు కొట్నాల త్రినాథ్, పుప్పాల రమేష్, భీమరశెట్టి పైడినాయుడు, ఆడిటర్ మూర్తి, కోడూరు సూరిబాబు, జన్నపల్లి రమేష్, సిహెచ్.మధు పాల్గొన్నారు.

పెన్షనర్లకు అండగా అసోసియేషన్

విశాలాంధ్ర - యలమంచిలి: పెన్షనర్ల సమస్యల పరిష్కారం కోసం నిరంతరం కృషి చేస్తున్నట్లు పెన్షనర్ల అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు డి.డి.ప్రసాద్‌రావు అన్నారు. శుక్రవారం యలమంచిలి పట్టణం స్థానిక ఎన్జీవోస్ హెరాంలో వారి సర్వసభ్య సమావేశం రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్స్ అసోసియేషన్ తాలూకా యూనిట్ అధ్యక్షులు సిహెచ్ సోమేశ్వరరావు ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రసాద్‌రావు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వ పెన్షనర్ల అసోసియేషన్ స్థాపించిన నాటి నుండి నేటి వరకు పెన్షనర్ల సమస్యలను అనేకం పరిష్కరించినట్లు తెలిపారు. పెన్షనర్, ఫ్యామిలీ పెన్షనర్లకు అన్ని విధాల అసోసియేషన్ అండగా ఉంటుందన్నారు. అనంతరం 75 సంవత్సరాలు నిండిన 14 మంది విశ్రాంతి ఉద్యోగులకు సన్మాన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి టి.కృష్ణమూర్తి, జిల్లా కోశాధికారి డి.ఎస్.ఎన్ మూర్తి, జిల్లా సంయుక్త కార్యదర్శి టివి రమణమూర్తి, పెన్షనర్లు వారి కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

మంచినీటి బావులలో 'గంభుషియా' చేపలు విడుదల

విశాలాంధ్ర - మల్కాపురం: పారిశ్రామిక ప్రాంతం పరిధి 40వ వార్డు ఏకేసీ కాలనీలో డెంగ్యూ, మలేరియా దోమలు వ్యాప్తిని అరికట్టేందుకు అవసరమైన 'గంబుషియా' చేపలను శుక్రవారం వార్డు గుండపు నాగేశ్వరరావు (జీవిన్నార్) చేతుల మీదుగా మంచినీటి బావులలో మలేరియా విభాగం అధికారులు విడుదల చేయించారు. ఈ సందర్భంగా కార్పొరేటర్ జీవిన్నార్ మాట్లాడుతూ వర్షాలు అధికంగా కురుస్తున్న నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, చికున్ గునియా వంటి సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశం ఉన్నందున ప్రజలంతా అప్రమత్తమై తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో మల్కాపురం ఏరియా మలేరియా ఇన్‌స్పెక్టర్ డి.రవికుమార్, హెల్త్ అసిస్టెంట్ రోమాల వేణుబాబు, మలేరియా సూపర్ వైజర్లు వి.విజయకుమారి, దుల్లా శ్రీనివాసరావు, శానిటరీ సెక్రటరీ సత్తిబాబు, మేస్త్రి శ్రీనివాస్, ఆశా కార్యకర్తలు పావని, నాగమణి, వార్డు వైసీపీ అధ్యక్షులు వరపల మహేష్ పాల్గొన్నారు.

కంపోస్ట్ తయారీపై గీతంలో శిక్షణ

విశాలాంధ్ర - మధురవాడ: గృహలలో, హెూటళ్ళు, విందు కార్యక్రమాలలో వృథాగా పారవేసే ఆహార పదార్థాల నుంచి వ్యవసాయరంగానికి మేలు చేసే విధంగా కంపోస్ట్ తయారు చేసుకుని పంటల దిగుబడి ఏ విధంగా పెంచవచ్చో తెలియజేస్తూ గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం పర్యావరణ శాస్త్ర విభాగం చేపట్టిన ప్రాజెక్టు సత్ఫలితాలను ఇస్తోందని ప్రాజెక్టు ప్రధాన నిర్వహణ అధికారి డాక్టర్ ఎన్.శ్రీనివాస్ తెలియజేశారు. భారత ప్రభుత్వ శాస్త్ర సాంకేతిక విభాగం (డిఎస్‌టి) మంజూరు చేసిన ప్రాజెక్టు సైన్స్ ఫర్ ఈక్విటీ ఎంపవర్‌మెంట్ అండ్ డవలప్‌మెంట్ (సీడ్) లో భాగంగా శుక్రవారం నిర్వహించిన అవగాహనలో మాట్లా దారు. కంపోస్ట్ తయారీపై 100 మంది పైగా రైతులకు దశలవారీగా శిక్షణ ఇచ్చామన్నారు. కార్యక్రమంలో గీతం పర్యావరణశాస్త్ర విభాగం సహాయ ప్రొఫెసర్ డాక్టర్ కె.సురేష్‌కుమార్, గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ ప్రొఫెసర్ ఐ.బంగారు రాజు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

విశాలాంధ్ర - పరవాడ: ప్రజా సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యమని పెందుర్తి ఎమ్మెల్యే అన్నంరెడ్డి అదీప్‌రాజ్ అన్నారు. తానాంలో మూడోరోజు శుక్రవారం తిరిగి ప్రారంభించిన గడప గడపకు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. హైస్కూల్ రోడ్, దుంగలవారి వీధిలో ఇంటింటికీ వెళ్లి సంక్షేమ పథకాల లబ్ధిని వివరించారు. సంక్షేమ పథకాలకు సంబంధించి బుక్‌లెట్లను అందించి ప్రజల సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా అదీప్‌రాజ్ మాట్లాడుతూ ఎటువంటి అవినీతికి తావులేకుండా సంక్షేమ ఫలాలు నేరుగా ప్రజల ఖాతాల్లోకి జమ చేస్తున్న ఘనత ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డికే దక్కుతుందన్నారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ పైల సన్యాసిరాజు, వైసీపీ సీఈసీ సభ్యుడు పైల శ్రీనివాసరావు, ఈవోఆర్డీ హేమసుందరరావు, నాయకులు వెన్నెల సన్యాసిరావు, కూండ్రపు సీతారామయ్య, దెక్క నూకరాజు, బత్తి అప్పారావు తదితరులు పాల్గొన్నారు.

సాధారణ ఎన్నికలకు అధికారులు సన్నద్ధం కావాలి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: సాధారణ ఎన్నికలకు అధికారులు సిద్ధం కావాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేశ్ కుమార్ మీనా పేర్కొన్నారు. శుక్రవారం సాయంత్రం 2024 సాధారణ ఎన్నికలకు సంబంధించి చేయవలసిన ఏర్పాట్లపై విజయవాడ నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జాయింట్ కలెక్టర్ కెయస్ విశ్వనాథన్, సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు. అసెంబ్లీ లోక్ సభ ఎన్నికలు జరగనున్నందున అందుకు అనుగుణంగా ఇప్పటి నుండే ఏర్పాట్లు ప్రారంభించాలని అధికారులను ఆదేశించారు. ఇప్పటికే ఎలక్షన్స్ సిబ్బందికి శిక్షణ కార్యక్రమాలు నిర్వహించినట్లు పేర్కొన్నారు. కొత్త ఓటర్లు నమోదుకు సంబంధించి దరఖాస్తులు పెండింగ్ లేకుండా చూడాలని ఆయన తెలిపారు. ఈవీఎం గోదాముల భద్రతపై అధికారులు చర్యలు చేపట్టాలన్నారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో డీఆర్వో ఎస్.శ్రీనివాసమూర్తి, ఎస్డీసీలు, ఎలక్షన్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర - నక్కపల్లి: మండల కేంద్రమైన నక్కపల్లిలో అన్ని ప్రభుత్వ కార్యాలయాల వద్ద పటిష్టవంతమైన ఇంకుడు గుంతలు ఏర్పాటు చేయాలని వైస్ ఎంపీపీ వీసం నానాజీ సూచించారు. శుక్రవారం ఎంపీపీ కార్యాల యంలో వైస్ ఎంపీపీ వీసం నానాజీ, ఎంపీడీవో శ్రీనివాసరావు, ఏపీవో సీతారామరాజు, ఈవోపీఆర్డీ వెంకట నారాయణ తదితరులు ఉపాధి పథకం సిబ్బందికి పలు సూచనలు చేశారు. భూగర్భ జలాల పరిరక్షణ, ప్రభుత్వ కార్యాలయాల వద్ద నీరు నిల్వ లేకుండా ఇంకుడు గుంతలను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. నక్కపల్లి 50 పడకల ఆస్పత్రి వద్ద కూడా దీనిని ఏర్పాటు చేయాలన్నారు. తదుపరి మండలంలోని అన్ని గ్రామాల్లో వున్న పాఠశాలలు, ప్రభుత్వ భవనాల వద్ద కూడా వీటిని ఏర్పాటు చేయాలన్నారు. ఇందులో ఏపీవో భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

డ్వాక్రా నగదుతో మహిళ పరారీ

విశాలాంధ్ర - ఆనందపురం: డ్వాక్రా గ్రూపులకు లీడర్‌గా ఉంటూ మద్దిల చిన్ని అనే మహిళ డ్వాక్రా గ్రూపులో వచ్చిన నగదుతో లింగాలవలసకు చెందిన తన స్నేహితుడు సత్యనారాయణకు ఇచ్చినట్లు తరువాత అప్పుల బాధ భరించలేక 17.2.2023 సంవత్సరంలో ఆనందపురం పోలీస్ స్టేషన్‌లో కంప్లైంట్ ఫైల్ చేశారు. కేసును మహిళ కనబడట్లేదని నమోదు చేశారు. ఫిర్యాదుదారుడు అయిన తన భర్త మద్దిల రాంబాబుకు మార్చి నెలలో తన భార్యను అప్పగించారు. మరల పది రోజులు సక్రమంగా ఉండి తదుపరి డ్వాక్రా డబ్బులు పట్టుకొని ఎవరూ ఇంట్లో లేని సమయంలో వెళ్ళిపోయింది. భర్త ఫిర్యాదు మేరకు ఆనందపురం పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

గందరగోళంగా భూసర్వే: ప్రత్యేక అధికారి లచ్చన్న

విశాలాంధ్ర - పాయకరావుపేట: గ్రామాల్లో నిర్వహించిన భూ సర్వే గందరగోళంగా ఉందని మండల ప్రత్యేక అధికారి లచ్చన్న అన్నారు. మండలంలోని వెంకటనగరం గ్రామంలో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా దరఖాస్తు చేసుకున్న వారికి కుల, ఆదాయ, తదితర ధృవపత్రాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లచ్చన్న మాట్లాడుతూ భూముల రికార్డులు గందరగోళంగా ఉన్నాయని ప్రభుత్వం భూ సర్వే చేపట్టిందని తెలిపారు. సర్వే చేసిన తర్వాత కూడా భూములు పరిస్థితి గందరగోళంగా ఉంటే ఎలా అని ప్రశ్నించారు. ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలు వాలంటీర్లు వారంరోజులపాటు నిర్వహించిన ఇంటింటి సర్వేలో ఎందుకు గుర్తించలేదని వాలంటీర్లను ప్రశ్నించారు. గ్రామంలో వాలంటీర్లు సక్రమంగా పనిచేయ లేదనటానికి ఇదే నిదర్శనమని తెలిపారు. సర్పంచ్ వంకా వెంకటరమణ మాట్లాడుతూ జలజీవన్ మిషన్‌లో భాగంగా గ్రామంలో కొన్ని ఇళ్లకు మాత్రమే కుళాయిలు వేశారని మిగిలిన ఇళ్లకు కూడా వేసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. అలాగే గ్రామంలో కొంతమంది ఇళ్లపై విద్యుత్ తీగలు ఉంటున్నాయని వాటిని మార్చేందుకు విద్యుత్ శాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. గ్రామంలో ఏడాదిన్నరగా 9మందికి పింఛన్లు నిలిచిపోయాయని తెలిపారు. రొయ్యల చెరువులు వల్ల తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నామని వాటిని శాశ్వతంగా మూసేందుకు చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో మత్స్యకార కార్పోరేషన్ డైరక్టర్ చోడిపిల్లి శ్రీనివాసరావు, ఎంపీడీఓ సాంబశివరావు, డిప్యూటి తహశీల్దార్ కె.నూకరాజు, ఇన్‌ఛార్జి ఈఓపీఆర్‌డి వై.సత్యనారాయణ, పంచాయతీ కార్యదర్శులు బిఎబిఎల్ మూర్తి, మల్లికార్జునరావు, జేఈలు కచేరి, మనోజ్‌కళ్యాణ్ తదితరులు పాల్గొన్నారు.

పిట్లపాలెంలో గడప-గడపకు

విశాలాంధ్ర - యస్.రాయవరం: మండలంలోని పెద ఉప్పలం గ్రామ పంచాయతీ పరిధి పిట్లపాలెం గ్రామంలో గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. శుక్రవారం పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబురావు గ్రామంలోని ఇంటింటికి తిరిగి ప్రభుత్వ పథకాల గురించి వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో రామచంద్రమూర్తి, తహశీల్దార్ విజయకుమార్, ఈవోపీఆర్డీ సత్యనారాయణ, మండల వైసీపీ కన్వీనర్ కొణతాల శ్రీనివాస రావు, వైసీపీ సీనియర్ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, అల్లాడ నాగరాజు, రామ చంద్రరాజు, పినపాత్రుని గణేష్, సర్పంచ్ కోశెట్టి రమణ, మండల సచివాలయ కన్వీనర్ డి.సందీప్ తదితరులు పాల్గొన్నారు.

రోడ్లపై దుకాణాల తొలగింపు

విశాలాంధ్ర - భీమునిపట్నం: భీమునిపట్నం గంటస్తంభం పరిసర ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 6 గంటల నుండి జోనల్ కమిషనర్ రాము తమ సిబ్బందితో పర్యటించి రోడ్లపై ఉన్న దుకాణాలను తొలగించి మార్కెట్‌లోకి తరలించారు. ఇకపై ఎవరైనా దుకాణాలను రోడ్లపై పెట్టి విక్రయాలు కొనసాగిస్తే ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. తమ సిబ్బందితో కలిసి ప్రత్యేక డ్రైవ్ నిర్వహించి ట్రాఫిక్ కి ఇబ్బంది లేకుండా ఆ దుకాణాలను లోపలకి తరలించామని ఈ విషయాన్ని స్థానిక స్టేషన్ అధికారి రమేష్ దృష్టిలో కూడా పెట్టామని వెంటనే ఆయన స్పందించి తమ సిబ్బందితో దుకాణదారులకు హెచ్చరికలు జారీ చేశారని అన్నారు. ఎవరైనా రోడ్లపైకి వచ్చి విక్రయాలు సాగిస్తే తమ దృష్టికి తీసుకురావాలని కోరారు.

జగనన్నకు చెబుదాం ఫిర్యాదులను ప్రత్యేక శ్రద్ధతో పరిష్కరించాలి

జిల్లా ప్రత్యేక అధికారి జె.నివాస్

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి: జగనన్నకు చెబుదాం కార్యక్రమంలో వచ్చే అర్జీలపై ప్రత్యేక శ్రద్ధ కనబరిచి పరిష్కరించి సంతృప్తి స్థాయి పెరిగేందుకు చర్యలు చేపట్టాలని అనకాపల్లి జిల్లా ప్రత్యేక అధికారి, ఆరోగ్యం కుటుంబ సంక్షేమం సంచాలకులు జె.నివాస్ అధికారులను ఆదేశించారు. శుక్రవారం కలెక్టర్ కార్యాలయంలో జరిగిన సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడుతూ జగనన్నకి చెబుదాం కార్యక్రమంపై ప్రభుత్వం ప్రత్యేక శ్రద్ధ చూపుతోందని అర్జీలపై ఎలాంటి నిర్లక్ష్యం వహించకుండా సకాలంలో సమస్యలను పరిష్కరించాలని ఆయన అధికారులని ఆదేశించారు. ప్రతి అర్జీని క్షుణ్ణంగా పరిశీలించి అర్జీదారులు సంతృప్తి చెందేలా సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమావేశంలో ట్రైనీ కలెక్టర్ స్మరన్ రాజ్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకట రమణ, ఏఎస్పీ విజయ్ భాస్కర్, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్చొద్దు

విశాలాంధ్ర - అరకులోయ: ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 40 లక్షల పైగా బీసీ జాబితాలో ఉన్న ఆర్థికంగా, సామాజికంగా, రాజకీయంగా ముందున్న బోయ వాల్మీకి రాయలసీమ ఏరియా కులస్తులను ఎస్టీ జాబితాలో చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం అసెంబ్లీలో తీర్మానం చేసి పార్లమెంట్ వర్షాకాల సమావేశంలో విజయసాయిరెడ్డి పార్లమెంట్లో ప్రస్తావించడాన్ని ఖండిస్తున్నామని గిరి జాగృతి అసోసియేషన్ అధ్యక్షుడు మోరి సింహాచలం పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన విలేకరులతో మాట్లాడుతూ బీసీల్లో ఉన్న బోయలను ఎస్టీల్లో చేర్చాలని రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా ప్రయత్నం చేస్తుందో అర్థంకావడం లేదన్నారు. ఇప్పటికైనా ఈ ఆలోచనను వెనక్కి తీసుకోవాలని కేంద్ర ప్రభుత్వం ఈ బిల్లును ఆపాలని ఆయన కోరారు.

ముంచింగిపుట్టు: వర్షాకాల పార్లమెంటు సమావేశంలో బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించే నిర్ణయం వెనక్కి తీసుకోవాలని ఆదివాసి గిరిజన సంఘంనాయకులు డిమాండ్ చేశారు. రాజ్యసభలో గిరిజనులకు ద్రోహం చేసే విధంగా వైసీపీ రాజ్యసభ సభ్యుడు విజయసాయిరెడ్డి మాట్లాడిన తీరుకు నిరసనగా ఆయన దిష్టిబొమ్మ దగ్ధం చేసి ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు శుక్రవారం నిరసన చేపట్టారు. లక్ష్మీపురం పంచాయతీ సర్పంచ్ కె.త్రినాద్ మాట్లాడుతూ బోయ వాల్మీకులను ఎస్టీ జాబితాలో చేర్పించేందుకు ప్రయత్నిస్తున్న జగన్మోహన్ రెడ్డి ఆదివాసులకు పెద్ద ద్రోహిగా మిగిలిపోతారని అన్నారు. కార్యక్రమంలో మండల ఆదివాసి గిరిజన సంఘం అధ్యక్షులు ఎంఎం శ్రీను, గిరిజన సంఘ నాయకులు త్రినాథ్, కాసిరం దొర, భీమరాజు, రామదాసు, బలరాం తదితరులు పాల్గొన్నారు.

డుంబ్రిగూడ: బీసీ (ఏ) కులానికి చెందిన బోయ వాల్మీకులను, బెంతులను ఎస్టీ జాబితాలో చేర్చాలని కోరుతూ పార్లమెంటులో వైసీపీ ఎంపీ విజయసాయిరెడ్డి ప్రస్తావించడాన్ని నిరసిస్తూ స్థానిక కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని అరకు సంత బయలు వద్ద గిరిజనులు ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు వి.చిన్నస్వామి మాట్లాడుతూ ఆర్థికంగా అన్ని రకాలుగా అభివృద్ధి చెందిన బోయలను, బెంతులను ఎస్టీ జాబితాలో చేర్పిస్తే గిరిజనులు తీవ్రంగా నష్టపోతారన్నారు. దీనిపై గిరిజన ఎమ్మెల్యే పాల్గుణ, పాడేరు ఎమ్మెల్యే భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ రవిబాబు, ఎంపీ మాధవి తమ వైఖరిని స్పష్టం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల అధ్యక్షుడు డి.మోహన్ రావు, ఉపాధ్యక్షుడు వి.గంగాధర్, సీనియర్ నాయకులు వి.వెంకటబాబు, కొండప్ప, స్వాభి, గేన్ను కార్యకర్తలు, గిరిజనులు పాల్గొన్నారు.

రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్‌ను కలిసిన కొర్రా రామలక్ష్మి

విశాలాంధ్ర - అనంతగిరి: రాష్ట్ర ఎస్టీ కమిషన్ చైర్మన్ డీవీజీ శంకరరావుని రాష్ట్ర ఎస్టీ కమిషన్ సభ్యులు కొర్రా రామలక్ష్మి, రామచంద్రరావు దంపతులు కలిశారు. ఆంధ్రప్రదేశ్ ఎస్టీ కమిషన్ చైర్మన్‌గా డాక్టర్ డీవీజీ శంకరరావు ప్రమాణ స్వీకారో త్సవం శుక్రవారం విజయవాడలో వేడుకగా నిర్వహించారు. కార్యక్రమంలో భాగంగా రాష్ట్ర డిప్యూటీ సీఎం, గిరిజన సంక్షేమశాఖ మంత్రి పీడిక రాజన్న దొర, కుంభా రవిబాబు, అల్లూరి జిల్లా వైసీపీ అధ్యక్షులు, ఎమ్మెల్యే కొట్టగుల్లి భాగ్యలక్ష్మి, జీసిసి చైర్ పర్సన్ శోభా స్వాతిరాణి, ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబు, మెడికల్ కౌన్సిల్ మెంబర్ డా. నరసింగరావు, ఎస్టీ కమిషన్ సభ్యులు వడిత్యా శంకర్ నాయక్, లిల్లీ సురేష్, వైసీపీ సోషల్ మీడియా అల్లూరి జిల్లా కన్వీనర్ తెడబారికి సురేష్ కుమార్, ఎస్టీ కమిషన్ సెక్రటరీ డా. గంగాధర్ పాల్గొన్నారు.

ఏయూతో లైఫ్ ఫెర్టిలిటి అవగాహన ఒప్పందం

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఆంధ్ర విశ్వవిద్యాలయంతో నగరానికి చెందిన లైఫ్ ఫెర్టిలిటీ సెంటర్ అవగాహన ఒప్పందం చేసుకుంది. శుక్రవారం ఒప్పంద పత్రాలపై ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి.ప్రసాదరెడ్డి సమక్షంలో ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్, లైఫ్ ఫెర్టిలిటి కేంద్రం నిర్వాహకులు డాక్టర్ కె.మురళీకృష్ణలు సంతకాలు చేశారు. ఒప్పందంలో భాగంగా సర్టిఫికేట్, డిప్లమా, పీజీ కోర్సులను క్లినికల్ ఎంబ్రియాలజీలో నిర్వహిస్తారు. అత్యంత ఉపాధి అవకాశాలు కలిగిన ఈ కోర్సులను నిర్వహించే దిశగా ఈ అవగాహన ఒప్పందం చేసుకున్నారు. ఈ సందర్భంగా ఏయూ వీసీ ఆచార్య పి.వి.జి.డి ప్రసాద్ రెడ్డి మాట్లాడుతూ వందశాతం అప్రెంటిస్ షిప్ అనుసంధానం కలిగిన కోర్సుగా దీనిని రూపొందించాలని సూచించారు. ఏయూ రెక్టార్ ఆచార్య కే సమత, రిజిస్ట్రార్ ఆచార్య వి. కృష్ణమోహన్ మాట్లాడుతూ ఈ రంగంలో నిపుణుల కొరత ఉందని, కోర్సులు పూర్తిచేసిన వారికి మెరుగైన ఉపాధి అవకాశాలు లభిస్తాయన్నారు. లైఫ్ ఫెర్టిలిటీ కేంద్రం నిర్వాహకులు డాక్టర్ కె.మురళీ కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వరద సహాయక చర్యలు ముమ్మరం

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: చింతూరు డివిజన్‌లో ప్రస్తుత వరద పరిస్థితి కారణంగా ఇద్దరు ప్రత్యేక ఉప కలెక్టర్లను మండల ప్రత్యేక అధికారులుగా నియమిస్తూ జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ ఉత్తర్వులు జారీ చేసారు. కూనవరం ప్రత్యేక ఉప కలెక్టర్ వి.వెంకట రమణను కూనవరం ప్రత్యేక అధికారిగాను, వి.ఆర్ పురం ప్రత్యేక ఉప కలెక్టర్ జి.లక్ష్మీపతిని వి.ఆర్.పురం ప్రత్యేకాధికారిగాను నియమించారు. ఈ ఇద్దరు ప్రత్యేక అధికారులు సంబంధిత మండలాల్లో మండల ప్రధాన కేంద్రంలో ఉండాలని, మండల తహశీల్దార్‌లతో సమన్వయం చేసుకుని నిత్యావసర సరుకుల పంపిణీ పర్యవేక్షించాలని అన్నారు.

విద్యతోనే ఉజ్వల భవిష్యత్

విశాలాంధ్ర - తగరపువలస: విద్యతోనే భవిష్యత్ ప్రకాశవంతమైనదిగా ఉంటుందని, విద్య ఉన్నతమైన ఎదుగుదలకు నాంది అని బోయవీధి గ్రామ పెద్దలు కాసరపు దుర్గారావు, కొక్కిరి కాశీదు, అరసవిల్లి పోలిరాజు అన్నారు. భీమిలి జోన్ 3వ డివిజన్‌లో ఉన్న మత్స్యకారుల గ్రామం బోయవీధిలో శుక్రవారం గ్రామ పెద్దల ఆధ్వర్యంలో గ్రంథాలయం ప్రారంభించారు. జాలారుల సంక్షేమ సంఘం సమక్షంలో ఏర్పాటైన గ్రంథాలయాన్ని ఉద్దేశించి గ్రామ పెద్దలు, జాలారుల సంక్షేమ సంఘం అధ్యక్షులు కొక్కిరి నూకరాజు, మాజీ మున్సిపల్ కౌన్సిలర్ కదిరి ఎల్లాజి, వాడమొదలు సత్యారావు తదితరులు మాట్లాడారు. ప్రతీ విద్యావంతుడు, యువత ఈ గ్రంథాలయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో గ్రామ సభ్యులు కాసరపు నాగరాజు, వాడమొదలు సత్యా రావు, కాసరపు నర్సింగరావు, కాసరపు ఎల్లాజీ, వాడమొదలు క్రిష్ణ, తెద్దు సింహాద్రి, తెద్దు గొల్లబాబు, తెద్దు రామాదాసు, కాసరవు ఎల్లాజీ, కొక్కిరి అప్పన్న, అరసవిల్లి అనిల్, వాడమొదలు చిన్న ఆదెప్ప, కాసరపు అచ్చిరాజు, కదిరి ఎల్లయ్య, తెద్దు పోతురాజు, కాసరపు అప్పన్న, కొక్కిరి అప్పన్న తదితరులు పాల్గొన్నారు.

చిన్నమ్మకు ఘన స్వాగతం

విశాలాంధ్ర - గోపాలపట్నం: గ్రేటర్ విశాఖ బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి(చిన్నమ్మ) శుక్రవారం నగరానికి చేరుకున్నారు. ఆమె అధ్యక్షురాలిగా బాధ్యతలు చేపట్టిన తరువాత ఇక్కడికి రావడం ఇదే మొదటిసారి కావడంతో పార్టీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు ఘనంగా స్వాగతం పలికారు. విమానాశ్రయం నుంచి ర్యాలీగా బయలుదేరి ఎన్ఏడీ జంక్షన్, కంచరపాలెం మెట్టు, తాటిచెట్లపాలెం మీదుగా మద్దిలపాలెం, ఎంవీపీ కాలనీ డబుల్ రోడ్డు మీదుగా పార్టీ కార్యాలయానికి చేరుకున్నారు.

నిధులను దుర్వినియోగం చేస్తున్న వైసీపీ

బీజేపీ రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్: రాష్ట్రాభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం నిధులు ఇస్తున్నప్పటికీ వాటిని దారి మళ్లించి తిరిగి రాష్ట్రానికి కేంద్రం ఏమీ చేయలేదంటూ దుష్ప్రచారం చేస్తున్నారని బీజేపీ ఏపీ అధ్యక్షురాలు దగ్గుబాటి పురందేశ్వరి మండిపడ్డారు. శుక్రవారం నగరానికి విచ్చేసిన ఆమె లాసన్స్ బే కాలనీలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. రాష్ట్రంలో లక్షా 57 వేల 800 ఇళ్ల నిర్మాణానికి, కేంద్రం నిధులు అందించిందన్నారు. ఉత్తరాంధ్రలోని అన్ని జిల్లాలకు ఇళ్ల కేటాయింపు జరిగిందన్నారు. అయితే రాష్ట్ర మంత్రి గుడివాడ అమర్ నాథ్ కేవలం 21వేల ఇల్లు మాత్రమే నిర్మాణాలు చేశామని వెల్లడించారని, దీనిపై వైసీపీ శ్వేతపత్రం విడుదల చేయాలని ఆమె డిమాండ్ చేశారు. రూ.18,40 కోట్లతో రైల్వే కొత్తవలస డబ్లింగ్ ఏర్పాటు చేశామన్నారు. రూ.వెయ్యి కోట్లతో విజయనగరం, కూనేరు మూడవ లైన్, రూ.1900 కోట్ల రూపాయలతో ఒడిషాకు మూడవ లైన్ నిర్మించామన్నారు. రూ.6,300 కోట్లతో ఆరు లైన్ల రోడ్డు, భోగాపురం లైన్ కేటాయించినట్లు తెలిపారు. జాతీయ స్థాయి విద్యా సంస్థలు ఐఐఎం, పెట్రోలియం, గిరిజన యూనివర్సిటీ, హెచ్పీసీఎల్ ఎక్స్టెన్షన్, ఇండస్ట్రీయల్ కారిడార్ వంటివి ఇవ్వడం జరిగిందని పురంధేశ్వరి అన్నారు. అట్టహాసంగా పెట్టుబడుల సమావేశం పెట్టిన రాష్ట్ర ప్రభుత్వం ఎంతవరకు సఫలీకృతం అయిందో చెప్పాలన్నారు. ఎంపీ ఇంట్లో దుండగులు చొరబడినా చర్చించే నాధుడు లేదని, రాష్ట్రంలో పూర్తిగా శాంతి భద్రతలు క్షీణించాయన్నారు. ఈ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు, బీజేపీ రాష్ట్ర అధికార ప్రతినిధి సుహాసిని, విశాఖ జిల్లా అధ్యక్షుడు మేడపాటి రవీందర్ రెడ్డి, సురేంద్రమోహన్, సుదర్శన్ రెడ్డి, గీత తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల నిరసన

విశాలాంధ్ర - పెదగంట్యాడ: ఆదాని గంగవరం పోర్టు యాజమాన్యం మొండి వైఖరికి నిరసనగా నిర్వాసిత కార్మికులు నిర్వహిస్తున్న నిరవేదిక నిరసనలు 25వ రోజు కొనసాగాయి. ఈ సందర్భంగా గంగవరం పోర్టు ఎంప్లాయిస్ యూనియన్ ప్రధాన కార్యదర్శి నొల్లి తాతారావు మాట్లాడుతూ పోర్టు నిర్మాణం కోసం భూములు సముద్రాన్ని త్యాగం చేసిన నిర్వాసిత కార్మికులకు చాలీచాలని వేతనాలతో ఆర్థిక ఇబ్బందుల్లో కూరుకుపోయామన్నారు. వేతనాల కోసం పోరాడుతుంటే పలు దపాలు సంప్రదింపులు జరిపిన యాజమాన్యం మొండిగా వ్యవహరిస్తుందన్నారు. కనీస జీతం 36000 ఇవ్వమని న్యాయబద్ధంగా కోరుతున్నప్పటికీ ఎటువంటి స్పష్టత యాజమాన్యం నుండి రాకపోవడం దారుణం అన్నారు. నిర్వాసిత కార్మికులకు పర్మినెంట్ ఉద్యోగాలు ఇచ్చామని చెప్పి అతి తక్కువ వేతనాలు చెల్లిస్తూ యాజమాన్యం దోచుకుంటుందన్నారు. కోట్ల రూపాయలు నికర లాభాలు అర్జిస్తున్న ప్రధాని యాజమాన్యం భూములు ఇచ్చిన నిర్వాసిత కార్మికులకు వేతనాల పెంచమంటే ఎందుకు చేతులు రావడంలేదని ప్రశ్నించారు. ఈ కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి అప్పలరాజు, వాసుపల్లి ఎల్లాజీ, లొల్లి స్వామి పేర్ల నూకరాజు తదితరులు పాల్గొన్నారు.

రచ్చబండ నిర్మాణానికి శంకుస్థాపన

విశాలాంధ్ర - హుకుంపేట: హుకుంపేట గ్రామపంచాయతీ దిగుడుపుట్టు గ్రామంలో రచ్చబండ నిర్మాణానికి మూడు లక్షల 50 వేల రూపాయలు నిధులు కేటాయించ డం జరిగిందని సర్పంచ్ వెంకట పూర్ణిమ తెలిపారు. శుక్రవారం జెడ్పీటీసీ రేగం మత్స్యలింగం, ఎంపీపీ కూడా రాజబాబులు చేతుల మీదుగా శంకుస్థాపన కార్యక్రమాన్ని నిర్వహించామని తెలిపారు. మండల పరిషత్ నుండి నిధులు కేటాయించడంపై పంచాయితీ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యవసాయ సలహా మండలి సభ్యులు విశ్వేశ్వర రావు, జిల్లా యువజన విభాగం అధ్యక్షులు నైని సత్తిబాబు, మండల నాయకులు అనిల్, సూరిబాబు, వార్డు మెంబర్ స్వరూప, గ్రామస్తులు పాల్గొన్నారు.

వరద బాధితుల కుటుంబాలకు సరుకులు పంపిణీ

విశాలాంధ్ర - ఎటపాక: మండలంలోని వరద బాధితుల కుటుంబాలకు తహశీల్దార్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో గన్నవరం సర్పంచ్ గద్దం భద్రమ్మ, ఎంపిటిసి కంటె రాజు చేతుల మీదుగా గ్రామాలలో వరద ముంపునకు గురైన 100 కుటుంబాలకు 100 కేజీల కందిపప్పు, 100 కేజీల ఉల్లిపాయలు, 100 కేజీల బంగళాదుంపలు, 100 కేజీల క్యాబేజి ఉచితంగా పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం లో జోనల్ అధికారి జి.స్వామి, సెక్రటరీ మణికంత, వీఆర్వో వీరమ్మ, తదితరులు పాల్గొన్నారు.

అర్హులందరికీ ఓటు హక్కు కల్పించాలి

విశాలాంధ్ర - మాకవరపాలెం: ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు అర్హత గల ప్రతీ ఒక్కరికి ఓటు హక్కు కల్పించాలని నర్సీపట్నం ఆర్డీవో హెచ్.వి.జయరాం అన్నారు. శుక్రవారం మాకవరపాలెం మండలం తామరం పంచాయతీ ఓటరు సర్వేను ఆకస్మికంగా తనిఖీ చేశారు. పోలింగ్ బూత్ సిబ్బంది ఏ విధంగా పని చేస్తున్నారో అడిగి తెలుసుకున్నారు. ఈ పోలింగ్ కేంద్రం పరిధిలో ఇంత వరకు ఎంత మంది ఓటర్లను సర్వే చేశారని అడిగారు. వచ్చే నెల 21వ తేదీ వరకు ఇంటింటా ఓటర్ల సర్వే ఉంటుందని ఆర్డీవో తెలిపారు. అనంతరం బయ్యవరం పంచాయతీ భూరీసర్వే కార్యక్రమంపై సమీక్షించారు. ఈ కార్యక్రమంలో తహశీల్దార్ ప్రసాదరావు, సర్వేయర్ శ్రీరామ్మూర్తి, వీఆర్వో నూకరాజు, బిఎల్ఒలు పాల్గొన్నారు.



కోతుల బెడద నుంచి పంటలను రక్షించాలి



విశాలాంధ్ర - మాకవరపాలెం: తరచూ వ్యవసాయ పంటలను నాశనం చేస్తున్న కోతుల నుంచి పంటలకు రక్షణ కల్పించాలని మాకవరపాలెం మండలం కొండలఅగ్రహారం రైతులు కోరుతున్నారు. సుమారు 100 వరకు కోతులు వచ్చి వ్యవసాయ పంటలను నాశనం చేస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే జీడిమామిడి తోటలు నాశనం చేశాయని, ఇప్పుడు కూరగాయ పంటలను నాశనం చేస్తున్నాయని వారు అంటున్నారు. ఎప్పటికైనా అధికారులు చర్యలు చేపట్టి కోతుల నివారణ చేయాలని వారు కోరుతున్నారు.

సైబర్ నేరాల పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట: సైబర్ నేరాల పట్ల విద్యార్థులు అప్రమత్తంగా ఉండాలని సీఐ అప్పలరాజు కోరారు. స్థానిక శ్రీప్రకాష్ విద్యాసంస్థలో విద్యార్థులకు సైబర్ నేరాలపై అవగాహన కల్గించారు. మోసపూరితంగా బ్యాంకు ఖాతాల్లో డబ్బులు కాజేయటం, ఎక్కువ మంది ఉపయోగించే ఫోన్‌పే ద్వారా రివార్డులు వస్తాయని మోసం చేయడం, రుణాల పేరిట మోసం చేయడం, అందమైన ఆడవాళ్ల ఫోటోలు పెట్టి ఆకర్షించడం, ఓటిపిలు చెప్పమనడం తదితర పట్ల అప్రమత్తంగా ఉండాలని తెలిపారు. ఈకార్యక్రమంలో ఎస్సై రమేష్, ప్రిన్సిపాల్ కె.వీర్రాజు, విద్యార్థులు పాల్గొన్నారు.

గోదావరిలో కొట్టుకుపోయిన కారు

విశాలాంధ్ర - ఎటపాక : ఎటపాక మండలం రాయన పేట సమీపంలో డ్రైవర్ లోతు అంచనా వేయకపోవడంతో రాయనపేట బ్రిడ్జి పాయింట్ సమీపంలో భద్రాచలానికి చెందిన వెగనార్ కారు వరద నీటిలో మునిగిపోయినట్టు సమాచారం. సురక్షితంగా బయటపడ్డ కారులోని ముగ్గురు వ్యక్తులను స్థానికులు సురక్షితంగా బయటకు తీసారు. కారును వెలికి తీసేందుకు ప్రయత్నాలు చేస్తున్నారు.

నల్లబ్యాడ్జీలతో విద్యుత్ ఉద్యోగుల నిరసన

విశాలాంధ్ర -యలమంచిలి: అపరిష్కృత సమస్యల పరిష్కారం కోరుతూ విద్యుత్ ఉద్యోగులు తమ భోజన విరామ సమయంలో వరుసగా 2వ రోజు జెఏసి ఆధ్వర్యంలో శుక్రవారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత కొంతకాలంగా పెండింగ్‌లో ఉన్న సమస్యలను పరిష్కారించాలని, అవుట్ సోర్సింగ్ సిబ్బందిని పర్మినెంట్ చేయాలని, ఎనర్జీ అసిస్టెంట్ల క్రమబద్ధీకరించాలని, వేతన సవరణచేయాలంటూ పలు సమస్యలపై యలమంచిలి విద్యుత్ కార్యాలయం వద్ద నిరసన తెలిపారు.

నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచాలి

విశాలాంధ్ర - చింతూరు: వరద బాధితుల సహాయక చర్యల్లో భాగంగా నిత్యావసర వస్తువులు అందుబాటులో ఉంచాలని జిసిసి అధికారులను ఐటీడీఏ పీవో సూరజ్ గనేరో ఆదేశించారు. బియ్యం, పప్పు వివిధ రకాల సామాగ్రి అందుబాటులో ఉంచాలని కోరారు. శుక్రవారం స్థానిక జీసీసీ గొడౌన్‌ను ప్రాజెక్ట్ అధికారి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నాలుగు మండలాలలో వరద సహాయక చర్యల్లో భాగంగా నిత్యావసర వస్తువులను అందుబాటులో ఉంచినట్టు తెలిపారు. జిల్లా కలెక్టర్ సుమిత్ కుమార్ వారి ఆధ్వర్యంలో సహాయ చర్యలకు ఎక్కడికక్కడ సిబ్బందిని ఏర్పాటు చేయడం జరిగిందని అయన తెలిపారు.

కండ్లకలక పట్ల అప్రమత్తంగా ఉండాలి

విశాలాంధ్ర బ్యూరో - పాడేరు: ఫ్లూ కాలంగా పిలువబడే వర్షాకాలం తనతోపాటు వైరస్, బాక్టీరియా ఇన్ఫెక్షన్లను వెంటపెట్టుకుని వస్తుందని ఏపీ, తెలంగాణ, ఒడిస్సా ఎల్ వి పి ఐ. వైద్యులు డాక్టర్ మురలీధర్ రామప్ప తెలిపారు. కాలంలో పెరిగిన తేమ చెమ్మ బాక్టీరియా, వైరసులు వృద్ధిచెందదానికి ఒక అనుకూలమైన వాతావరణాన్ని కల్పిస్తుందన్నారు. ఈ ఇన్ఫెక్షన్లలో చాలావరకూ అంటుకునేవి కాబట్టి, అవి తేలికగా ఒకరినుంచి మరొకరికి సంక్రమిస్తాయన్నారు. గులాబీరంగు కన్ను' అని కూడా అనబడే 'కండ్లకలక' ఇన్ఫెక్షన్‌ల వల్ల వస్తుందన్నారు. ఏమాత్రం లక్షణాలు కనిపించినా వైద్యుల్ని సంప్రదించాలని సూచించారు.

వారోత్సవాలతో అప్రమత్తమైన పోలీసులు

విశాలాంధ్ర - కొయ్యూరు: మావోయిస్టు వారోత్సవాల నేపథ్యంలో మంప పోలీసులు అప్రమత్తమయ్యారు. ఈనెల 28 నుండి ఆగస్టు 3 వరకు సిపిఐ మావోయిస్టు వారోత్సవాలు నేపథ్యంలో జిల్లా పోలీసు ఉన్నతాధికారుల ఆదేశాల మేర కొయ్యూరు మంప పోలీసులు విస్తృత వాహన తనిఖీలు చేపట్టారు. వారోత్సవాల కారణంగా మావోయిస్టులు ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడకుండా కొయ్యూరు సిఐ స్వామినాయుడు ఆధ్వర్యంలో మంప ఎస్ఐ లోకేష్ కుమార్ తమ సిబ్బంది ఏపీఎస్పీ సిబ్బందితో కలిసి బూదరాళ్ల రోడ్డులో వాహన తనిఖీలు చేపట్టారు. ప్రతి ఒక్కరిని క్షుణ్ణంగా పరిశీలించటంతో పాటు వారి వివరాలు సేకరించి వదులుతున్నారు. అనుమానిత అపరిచిత వ్యక్తుల కదలికలపై నిఘా పెంచారు. రాత్రి సమయాల్లో పోలీస్ స్టేషన్‌లు ప్రభుత్వ కార్యాలయాల వద్ద రహస్యగస్తి నిర్వహిస్తున్నారు. వారోత్సవాలతో అప్రమత్తమైన పోలీసులు ఏరియా డామినేషన్‌తో పాటు మావోయిస్టు చర్యలను కట్టడి చేసే విధంగా తగు ముందస్తు జాగ్రత్త చర్యలు చేపడుతున్నారు.



చిన్నమ్మా! మరిది మాయలో పడకమ్మా!

ఖర్చు పెడుతున్న ప్రతి పైసాకు ప్రభుత్వం లెక్క చెబుతుంది

పురంధేశ్వరికి మంత్రి అమర్నాథ్ సెటైర్లు....

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం: బిజెపి రాష్ట్ర అధ్యక్షురాలు పురందేశ్వరి తాజా వ్యాఖ్యలపై రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ తీవ్రంగా స్పందించారు. రాష్ట్రం అప్పులు ఊబిలో ఉందని, నిధులు దుర్వినియోగం అవుతున్నాయని, రాష్ట్ర ప్రభుత్వం లెక్కలు తప్పు చెబుతోందని పురందేశ్వరి చేసిన వ్యాఖ్యలను మంత్రి అమర్నాథ్ తీవ్రంగా ఖండించారు. శుక్రవారం స్థానిక సర్క్యూట్ హౌస్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పురందేశ్వరి బిజెపి అధ్యక్షురాలిగా మాట్లాడటం లేదని, బాబు గారి జనతా పార్టీ అధ్యక్షురాలుగా మాట్లాడుతోందని వ్యాఖ్యానించారు. మరిది గారు ఇచ్చిన స్క్రిప్ట్ చదువుతూ ఆమె రాష్ట్ర ప్రభుత్వంపై అర్థం పర్థం లేని విమర్శలు చేస్తే సహించేది లేదని హెచ్చరించారు. మీ తండ్రి గారు నెలకొల్పిన పార్టీని తిరిగి అధికారంలోకి తీసుకురావడానికి వేరే పార్టీ నుంచి మమ్మల్ని తిట్టడం ఎందుకు? అదే పార్టీని మీరు సొంతం చేసుకుని, మీరే రాజకీయం చేసుకోవచ్చు కదా? అని అమర్నాథ్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వానికి వివిధ మార్గాల ద్వారా ఆదాయం సమకూరుతుందని దానిని ఆధారంగా చేసుకుని ప్రభుత్వం ఖర్చులు చేస్తుందని, నిబంధనల మేరకే అప్పులు చేస్తుందని అమర్నాథ్ చెప్పారు. కేంద్ర ప్రభుత్వం, రాష్ట్రానికి ఇస్తున్న నిధులు అన్ని సక్రమంగానే ఖర్చవుతున్నాయని, అవసరమైతే దీనికి సంబంధించిన చర్చకు తాము సిద్ధంగా ఉన్నామని చెప్పారు. కేంద్రం ఇచ్చిన నిధులకు లెక్కలు కనిపించడం లేదని పురందేశ్వరిచేసిన ఆరోపణలను మంత్రి అమర్నాథ్ తీవ్రంగా ఖండించారు. 'మీ మరిది గారు ఇక్కడ ముఖ్యమంత్రిగా ఉన్నప్పుడు చేసిన అవకతవకల గురించి మీరు అప్పుడు ఎందుకు మాట్లాడలేదు? చంద్రబాబు హయాంలో విశాఖ నగరంలో వేలాది ఎకరాలు అన్యాక్రాంతం అయ్యాయని, గీతం కాలేజీ 40 ఎకరాలు ఆక్రమించుకుంటే అప్పుడు మీరు ఎందుకు మాట్లాడలేదు? ఇదే విశాఖపట్నం నుంచి మీరు ఎంపీగా, కేంద్ర మంత్రిగా పని చేశారని, ఆ సమయంలో మీరు రైల్వే జోన్ గురించి ఎందుకు మాట్లాడలేదు?' అని మంత్రి అమర్నాథ్ ప్రశ్నించారు. రాష్ట్రంలో పేదవాడి జీవన విధానం మారాలన్న ఉద్దేశంతో ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి పెద్ద ఎత్తున సంక్షేమ పథకాలను అందిస్తున్నారని ఆయన చెప్పారు. ఇక్కడ పథకాలను నీతి ఆయోగ్ కూడా అభినందించిందని ఆయన చెప్పారు. 'మీ మరిది మాయల ఫకీర్ ఉచ్చులో పడి మీ భర్త రాజకీయంగా నష్టపోయారని, మీరు కూడా అటువంటి పరిస్థితులు తెచ్చుకోవద్దని మంత్రి అమర్నాథ్ హితవు పలికారు. రాష్ట్రంలో శాంతిభద్రతల గురించి పురందేశ్వరి మాట్లాడటం బాధాకరమని, మణిపూర్‌లో జరుగుతున్న సంఘటనలకు ఆమె ఏం సమాధానం చెప్తారని మంత్రి అమర్నాథ్ ప్రశ్నించారు. బిజెపిలోని టిడిపి కోవర్టులు, మీ మరిది చంద్రబాబు నాయుడు వగైరాలు అంతా కలిసి ఎన్ని కుట్రలు చేసినా 2024 ఎన్నికల్లో వైసీపీ ఘన విజయాన్ని అడ్డుకోలేరని అమర్నాథ్ స్పష్టం చేశారు. ఇకనైనా పురందేశ్వరి ఎవరో ఇచ్చిన స్క్రిప్ట్ చదవకుండా ఆమె హుందాతనాన్ని కాపాడుకోవాలని మంత్రి అమర్నాథ్ సూచించారు.

పొగరాని పొయ్యిలకు వసూలు చేసిన డబ్బులు తిరిగి చెల్లించాలి

ఆదివాసీ గిరిజన సంఘం డిమాండ్

విశాలాంధ్ర - అరకులోయ: అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు ఐటిడిఏ పరిధిలో ఉచితంగా పంపిణీ చేయాల్సిన పొగరాని పొయ్యిలకు ఆదివాసి లబ్ధిదారుల నుండి డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని వసూలు చేసిన డబ్బులు తక్షణమే లబ్ధిదారులకు చెల్లించాలని ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పి.బాలదేవ్ డిమాండ్ చేశారు. శుక్రవారం అరకులోయ మండల కేంద్రంలో గల గిరిజన సంఘం భవనంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పాడేరు ఐటీడీఏ పరిధిలో అనంతగిరి అరకులోయ డుంబ్రిగూడ, హుకుంపేట పెద్దబయలు, ముంచింగిపుట్టు, పాడేరు, జి.మాడుగుల మండలాల్లో లండన్ ట్రముల్ ట్రనా కంపెనీ 3వేలు ఖరీదైన పొగరాని పొయ్యి ఆదివాసులకు ఉచితంగా పంపిణీ చేయాలని క్రాప్ జోన్ ఆగ్రో ఫారెస్ట్ ప్రైవేట్ లిమిటెడ్ కంపెనీ సంస్థ ఒప్పందం కుదుర్చుకొని 8 మండలాల పరిధిలో 40 వేల మంది లబ్ధిదారులకు ఒక్కొక్క లబ్ధిదారుల నుండి 250 రూపాయలు చొప్పున క్రాప్ జోన్ అగ్రో ఫారెస్ట్ సంస్థ ప్రతినిధులు రవాణా ఛార్జి పేరుతో సుమారు కోటి రూపాయలు వసూలు చేశారని అన్నారు. తక్షణమే అల్లూరి సీతారామరాజు జిల్లా కలెక్టర్ జోక్యం చేసుకొని బాధ్యులపై చర్యలు తీసుకోవాలని పొగరాని పొయ్యి ఉచితంగా లండన్ ట్రముల్ ట్రాన కంపెనీ వారు పంపిణీ చెయ్యమంటే క్రాప్ జోన్ అగ్రో ఫారెస్ట్ సంస్థ వారు ఆదివాసీల లబ్ధిదారులకు మోసం చేసి అక్రమంగా డబ్బులు వసూలు చేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

లబ్ధిదారుల నుండి వసూలు చేసిన డబ్బులు తిరిగి లబ్ధిదారులకు డబ్బుల రూపంలో చేతుల్లో ఇవ్వాలని బ్యాంకు ద్వారా చెల్లిస్తామంటే ఆదివాసి లబ్ధిదారులు నష్టపోతారని అంతకంటే ఎక్కువ ఖర్చు చేసి బ్యాంకులు చుట్టూ తిరగాల్సి వస్తుందని వసూలు చేసిన డబ్బులు ఆదివాసి రైతులకు గ్రామాల్లోకి వెళ్లి డబ్బులు చెల్లించాలని లేనిపక్షంలో ప్రభుత్వ అధికారులకు పోలీసులకు లబ్ధిదారులతో ఫిర్యాదుచేస్తామని వారు స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఆదివాసి గిరిజన సంఘం జిల్లా నాయకులు జి.చినబాబు, మండల కార్యదర్శి పి.రామన్న, నాయకులు నాని బాబు, అర్జున్, లబ్ధిదారులు రామన్న, విజయ్, చిన్నం రాజు, సన్యాసిరావు తదితరులు పాల్గొన్నారు.

సీతగుంట జంక్షన్ వద్ద గంజాయి పట్టివేత

విశాలాంధ్ర - పెదబయలు: మండలంలో సీతగుంట పంచాయతీ సీతగుంట జంక్షన్ వద్ద ఒడిశాకు తరలిస్తున్న గంజాయిని పోలీసులు పట్టుకున్నారు. నిందితుడిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించారు. గంజాయితో పాటుగా గంజాయి రవాణాకు ఉపయోగించిన మహేంద్ర జీప్‌ను, పల్సర్ బైక్‌లను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ఎస్సై మనోజ్ కుమార్ తెలిపిన వివరాల మేరకు ముందస్తు సమాచారంతో సీత గుంట జంక్షన్ వద్ద పోలీసులు తనిఖీ చేస్తుండగా జమిగుడా వైపు నుండి వస్తున్న మహేంద్ర జీప్ వాహనం నిలుపుదల చేసి అందులో ఉన్న ముగ్గురు వ్యక్తులలో ఒకరిని పట్టుకోగా ఇద్దరు పరారయ్యారని, పైలెట్ పల్సర్ బైక్ మీద ఉన్న వ్యక్తి బైక్ను వదిలేసి పారిపోవడంతో వాహనం తనిఖీ చేయగా 15 బస్తాల లో ఉన్న గంజాయిని గుర్తించారు. గంజాయిని మహేంద్ర జీపును పెదబయలు పోలీస్ స్టేషన్‌కు తరలించారు. పట్టుబడిన గంజాయి 450 కేజీలు ఉందని, దీని విలువ సుమారు 6,75,000 రూపాయలు ఉంటుందన్నారు. పట్టుబడిన వ్యక్తి పెదబయలు మండలం రుడకోట పంచాయతీ బాడం బీరు గ్రామానికి చెందిన కొడ పోతన్నగా గుర్తించామని సీఐ ఏ.సత్యనారాయణ తెలిపారు. పరారైన మరో ఇద్దరు నిందితులను త్వరలోనే పట్టుకుంటామని అన్నారు. ఈ తనిఖీలో పెదబయలు ఎస్సై మనోజ్ కుమార్ పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

వర్షాల పట్ల అప్రమత్తంగా ఉండండి

ఈపీడీసీఎల్ సిఎండి సూచన

విశాలాంధ్ర బ్యూరో- విశాఖపట్నం: రాష్ట్రంలో కురుస్తున్న కుండపోత వర్షాల దృష్ట్యా, ఆంధ్రప్రదేశ్ తూర్పు ప్రాంత విద్యుత్ పంపిణీ సంస్థ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ పృథ్వీతేజ్ ఇమ్మడి, ప్రజలు అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ వర్షాల కారణంగా విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలను పర్యవేక్షిం చడానికి జిల్లా కేంద్రాలలో ఉన్న సూపరింటెండింగ్ ఇంజనీరు వారి కార్యాల యంలో, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్/టెక్నికల్ నియంత్రణలో ఈ పర్యవేక్షణ కేంద్రాలు ఏర్పాటు చేయడం జరిగిందని తెలిపారు. ఇప్పటికే ఉన్న టోల్ ఫ్రీ నెంబర్ 1912 కు అదనంగా ఈ కేంద్రాలను ఏర్పాటు చేశామని చెప్పారు. తుపాను లేదా అధిక వర్షాల వలన విద్యుత్ సరఫరాలో కలుగుతున్న అంతరాయాలకు సంబంధించి అన్ని పనులు పూర్తయ్యే వరకు 24/ 7 ఈ పర్యవేక్షణ కేంద్రాలు పనిచేస్తాయన్నారు. ప్రజలు తమ విద్యుత్ సరఫరాలో అంతరాయాలు, స్తంభాలు / ట్రాన్స్ఫర్మర్లు దెబ్బ తినడం మరియు ఇతర సరఫరా సంబంధిత సమస్యలు పరిష్కరించడానికి ఆయా సర్కిల్ పరిధిలో ఈ క్రింద నెంబర్లను సంప్రదించవలసినదిగా వినియోగదారులకు సూచించారు.

వైసీపీ నుండి టీడీపీలోకి వలసలు

విశాలాంధ్ర - చింతపల్లి: తెలుగుదేశం పార్టీ అమలు చేయనున్న మహాశక్తి పథకం ద్వారా మహిళల జీవితాల్లో మార్పులు వస్తాయని పాడేరు నియోజకవర్గ తెలుగుదేశం పార్టీ ఇంచార్జ్, మాజీ ఎమ్మెల్యే గిడ్డి ఈశ్వరి అన్నారు. ఆ పార్టీ చింతపల్లి మండల అధ్యక్షుడు కిల్లో పూర్ణచంద్రరావు అధ్యక్షతన, అరకు పార్లమెంట్ కార్య నిర్వాహక కార్యదర్శి చల్లంగి జ్ఞానేశ్వరి, కోరాబు స్వర్ణ, కృష్ణ కుమారి ఆధ్వర్యంలో చిలకల మామిడి గ్రామంలో నిర్వహించిన మహాశక్తి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన ఆమె మాట్లాడుతూ వైసిపి ప్రభుత్వం వై యస్ జగన్మోహన్ రెడ్డి పరిపాలనలో మహిళలతో పాటు అందరూ అన్ని విధాలుగా నష్టపోయామని, ఆర్థిక భారం పెరిగిపోయిందని, గిరిజన ప్రాంతం ఎక్కడ అభివృద్ధి అనే జాడే కనపడలేదని, రాష్ట్రంలో మహిళలకు రక్షణ కరువైందని అన్నారు. వైసిపి నాలుగున్నర ఏళ్ళ పాలనలో విసిగిపోయి ప్రజలంతా వైసిపి నుండి టిడిపిలోకి వలస వచ్చే పరిస్థితులు వచ్చాయన్నారు. రాష్ట్ర ప్రజలంతా సైకో ముఖ్య మంత్రికి తగిన గుణపాఠం చెప్పడానికి సిద్ధంగా ఉన్నారన్నారు. చంద్రబాబు పెట్టిన మ్యాని ఫెస్టో చూసి వైసిపి నాయకుల గుండెల్లో రైళ్లు పరిగెడుతు న్నాయన్నారు. 2024లో జరగబోవు సార్వత్రిక ఎన్నికలలో తెలుగుదేశం పార్టీని గెలిపించుకోవాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. చిలకల మామిడి గ్రామంతో పాటు, బలపం మాజీ సర్పంచ్, గబు లంగి అప్పారావు తమ్మింగుల వైస్ సర్పంచ్ శ్రీదేవి, మల్లేశ్వరరావు, చుట్టుపక్కల గ్రామస్తులు సుమారుగా 100 కుటుంబాలు వైసిపి కి చెందిన కార్యకర్తలు తెలుగుదేశంలో చేరారు. ఈ కార్యక్రమంలో మండల ప్రధాన కార్యదర్శి ఆంద్రాబు, లక్ష్మణరావు, బేగ ఈశ్వరి, కొర్రా గున్నమ్మ, కొర్రా, రత్నకుమారి, కించే రత్నాలమ్మ, కొర్రా సంధ్య క్లస్టర్ ఇన్చార్జిలు పాంగి రాము వంతల భీమన్న, అరకు పార్లమెంట్ బీసీ సెల్ ఉపాధ్యక్షులు లక్కోజు నాగభూషణం, ఎస్.కె కాసిం వల్లి, అర్జున్ రావు పాల్గొన్నారు.

ఐసిఐసిఐ ప్రు ప్రొటెక్ట్ ఎన్ గెయిన్ విడుదల

విశాలాంధ్ర - విశాఖ సిటీ: ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ తమ సరికొత్త ప్రోడక్ట్ ఐసిఐసిఐ ప్రు ప్రొటెక్ట్ ఎన్ గెయిన్‌ను విడుదల చేసింది, ఇది సమగ్ర జీవిత బీమా కవరేజి అందించటంతో పాటుగా ప్రమాదవశాత్తు మరణం, ప్రమాదం కారణంగా శాశ్వత వైకల్యం నుండి రక్షణ అందిస్తుంది. అలాగే దీర్ఘకాలిక సంపదను నిర్మించడానికి ఆర్థిక లక్ష్యాలను సాధించడానికి మార్కెట్ ఆధారిత రాబడిని సైతం అందిస్తుంది. ఈ పథకం వార్షిక ప్రీమియం కంటే 100 రెట్లు అధిక జీవిత బీమా కవరేజీని అందిస్తుంది. ఈక్విటీ మరియు డెట్‌లో 18 ఫండ్ ఆప్షన్‌లను అందించడం ద్వారా కస్టమర్‌లు గరిష్ట రాబడిని పొందేలా చేస్తుంది. ఇది పాలసీ వ్యవధిలో కుటుంబానికి పూర్తి ఆర్థిక రక్షణ మరియు సర్వైవల్ సమయంలో గణనీయమైన మొత్తంలో నగదు పొందేలా ఇది తోడ్పడుతుందని ఐసిఐసిఐ ప్రుడెన్షియల్ లైఫ్ ఇన్సూరెన్స్ చీఫ్ డిస్ట్రిబ్యూషన్ ఆఫీసర్ అమిత్ పాల్టా చెప్పారు.

విస్తరణ దిశగా వోక్హార్ట్ లిమిటెడ్

విశాలాంధ్ర - విశాఖ సిటీ: అంతర్జాతీయ ఫార్మాస్యూటికల్, బయోటెక్నాలజీ కంపెనీ అయిన వోక్హార్డ్ లిమిటెడ్ తన వ్యాపార కార్యకలాపాలను మలుపు తిప్పాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఇందుకోసం ముఖ్యమైన వ్యూహాత్మక చొరవలను పరిశీలించింది. యూఎస్ బిజినెస్ పునర్నిర్మాణం, యూకేలో వ్యాక్సిన్ తయారీ కోసం సీరంతో వ్యాక్సిన్ ఒప్పందం, వ్యాపారాన్ని ముందుకు తీసుకెళ్లేందుకు నోవెల్ యాంటీబయాటిక్స్ రీసెర్చ్ వంటి అంశాలపై కంపెనీ దృష్టి సారించింది. 2023 నాలుగో త్రైమాసికంలో కంపెనీ ఆదాయంలో 7 శాతం వై ఓ వై వృద్ధితో బలమైన కార్యాచరణ పనితీరును నమోదు చేయగా, ఈబీఐటీడీఏ మూడు రెట్లు పెరిగి రూ.47 కోట్లకు చేరుకుంది. తన యుఎస్ కార్యకలాపాల పునర్నిర్మాణంలో, కంపెనీ మోర్టన్ గ్రోవ్ లోని తన ఉత్పత్తి కేంద్రాన్ని మూసేసి, సైట్‌ను కాంట్రాక్ట్ తయారీ సంస్థలకు బదిలీ చేస్తోంది. ఈ పునర్నిర్మాణం వల్ల 12 మిలియన్ డాలర్లు వార్షిక ఆదా అవుతుందని అంచనా. దీంతోపాటు 2022 మార్చిలో, కంపెనీ తన యూకే కేంద్రంలో టీకాలను ఉత్పత్తి చేయడానికి సీరం ఇన్స్టిట్యూట్ ఆఫ్ ఇండియాతో 51:49 (వోక్హార్ట్ 51, సీరం 49) జాయింట్ వెంచర్‌పై సంతకం చేసింది

బురదమయంగా మారిన రహదారులు

విశాలాంధ్ర - కొయ్యూరు: ఇటీవల కురుస్తున్న వర్షాలకు మండలంలోని పలు మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారులు బురదమయంగా మారాయి. మండలంలోని యు. చీడిపాలెం పంచాయతీ మారుమూల గ్రామాలకు వెళ్లే రహదారులు వర్షాల కారణంగా బురదమంగా మారాయి. దీంతో ఉల్లిబోగుల నుండి చీడిపాలెం పిహెచ్సి కి గర్భిణీ తీసుకొస్తున్న అంబులెన్స్ బురదలో కూరుకుపోయి ముందుకు కదలలేని పరిస్థితి నెలకొంది. ఎట్టకేలకు స్థానిక యువత సహాయంతో అంబులెన్స్ ను బురద నుండి బయటికి నెట్టడంతో గర్భిణీని ఆసుపత్రికి తరలించారు. పంచాయతీ పరిధి మారుమూల గ్రామాలకు వెళ్లే దారిలో కొండ వాగులు పొంగి ప్రవహిస్తుండడంతో రాకపోకలు సాగించేందుకు ప్రజానీకం ఇబ్బందులు పడుతున్నారు. దీంతో పిహెచ్సి వైద్య సిబ్బంది మారుమూల గ్రామాల్లో చిన్నారులకు వ్యాక్సినేషన్ వేసేందుకు అతి కష్టం మీద వాగులు దాటి ఆయా గ్రామాలకు చేరుకున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ గ్రామాలకు రహదారి సౌకర్యం కల్పించాలని ప్రజానికం కోరుతున్నారు.

స్టీల్‌ప్లాంట్‌ను కాపాడుకుందాం

విశాలాంధ్ర - కూర్మన్నపాలెం: అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా) స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా సంఘీభావం తెలిపారు. సభను ఉద్దేశించి పోరాట కమిటీ చైర్మన్ డి. ఆదినారాయణ, ఐద్వా రాష్ట్ర అధ్యక్షురాలు ప్రభావతి మాట్లాడారు. విశాఖ ఉక్కు పరిరక్షణకు మనం రాష్ట్రవ్యాప్తంగా చేయతలపెట్టిన ఐక్య ఉద్యమాలతోనే కేంద్ర ప్రభుత్వ విధానాలను ఎదుర్కోవచ్చని అన్నారు. గత తొమ్మిదేళ్ల కాలంలో కేంద్ర ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ప్రభుత్వ రంగ పరిశ్రమలను నిర్వీర్యం చేస్తూ, వాటిని కార్పోరేట్ పెద్దలకు కట్టపెట్టేందుకే కుట్ర చేస్తున్నారని ఆరోపించారు. విశాఖ ఉక్కును నిర్వీర్యం చేసేందుకే సొంత ఇనుప గనులు కేటాయించకుండా కాలయాపన చేస్తున్నారని ఆరోపించారు. ప్రభుత్వ రంగ పరిశ్రమలలో మాత్రమే భారత రాజ్యాంగం ప్రకారంగా ఎస్సీ, ఎస్టీ బీసీలకు రిజర్వేషన్లు ద్వారా ఉద్యోగం కల్పన వారిహక్కుల పరిరక్షణ సాధ్యమవుతుందని అన్నారు. ఈ విధానాలకు కేంద్రం భవిష్యత్తులో తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని అన్నారు. ప్రభుత్వ రంగ పరిశ్రమల పరిరక్షణకు మద్దతు ఇచ్చే పార్టీలను 2024 లో గెలిపించుకుంటే ప్రభుత్వ రంగ పరిశ్రమలను కార్మిక హక్కులను రక్షించుకోవడానికి అవకాశం ఉంటుందని ఆయన పేర్కొన్నారు. ఈ దీక్షలో పోరాట కమిటీ ప్రతినిధులు అయోధ్యరాం, అధిక సంఖ్యలో కార్మికులు పాల్గొన్నారు. ఇన్స్ట్రుమెంటేషన్,క్యూ ఏ టి డి, ఆర్ ఈ డి, టెలికాం, డి.ఎన్, డబ్లు విభాగాల ఉద్యోగులు పాల్గొన్నారు.

మంత్రివర్గం నుండి జోగి రమేష్‌ను బర్తరఫ్ చేయాలి

గాంధీ విగ్రహం వద్ద టీడీపీ నేతలు నిరసన

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : జోగి రమేష్ ను మంత్రివర్గం నుండి తక్షణమే తొలగించాలని జిల్లా తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అన్నారు. టీడీపీ అధినేత చంద్రబాబు, ప్రధాన కార్యదర్శి లోకేష్ పై మంత్రి జోగి రమేష్ విమర్శలు చేయడాన్ని నిరసిస్తూ శుక్రవారం గాంధీ విగ్రహం దగ్గర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు అధ్యక్షతన నినాదాలు చేస్తూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా పల్లా మాట్లాడుతూ సీఎం సైకో ఐతే మిగతా మంత్రులు కూడా సైకోలా మారుతున్నారని జోగి రమేష్ మాటలు బిసిల మనోభావాలు దెబ్బతీసేలా ఉన్నాయని అన్నారు. రాష్ట్ర ప్రజా స్వామయంలో బిసి ల అండ అవసరం ఉందని అలాంటి బిసిలు బాధపడేలా జోగి రమేష్ మాట్లాడటం బిసిలు అంటే ఆ పార్టీకి ఉన్న గౌరవానికి అద్దం పడుతుంది అన్నారు. వెంటనే జోగి రమేష్‌ను మంత్రివర్గం నుంచి తొలగించాలని డిమాండ్ చేసారు. మాజీ మంత్రి బండారు సత్యనారాయణ మూర్తి శాసనసభ మాజీ సభ్యులు తెలుగుదేశం పార్టీ దక్షిణ నియోజకవర్గం బాధ్యులు గండిబాబ్జిలు మాట్లాడుతూ వైసిపి రోజులు దగ్గర పడ్డాయని చెప్పుకొచ్చారు. ఈ కార్యక్రమంలో భీమిలి నియోజకవర్గం ఇంచార్జ్ కోరాడరాజబాబు, జీవీఎంసి ఫ్లోర్ లీడర్ పీలా శ్రీనివాసరావు, ఉత్తరం నియోజకవర్గం ఇంచార్జ్ చిక్కాల విజయ్ బాబు రాష్ట్ర పార్టీకార్యదర్శులు బోండా జగన్, గంట నూకరాజు, లోడగలకృష్ణ, గొలగని వీరారావు బుజ్జి, మొల్లి లక్ష్మణరావు, విల్లూరి చక్రవర్తి, నక్క కనకరాజు, బుడుమూరి గోవిందు, ఎర్నాకుల జగదీష్ , కేవీ స్వామి, నడిగట్ల శంకర్రావు, మేక సత్యకిరణ్ సర్వసిద్ధి అనంతలక్ష్మి, ఈతలపాక సుజాత గణగళ్ళ సత్య, తోట శ్రీదేవి నాగోతి శివాజీ గొర్లె అప్పారావు, బుచ్చ రామిరెడ్డి, నమ్మి రవికుమార్, సారిపల్లి మహేష్, బొద్దవు శ్రీనివాసరావు, సీఎం రమణ, ఈ సరపు వెంకటలక్ష్మి, నరవ అనూష, టిడిపి రాజు, కోరాడు చిన్న, ఆదిలక్ష్మి, చింతలపూడి సత్య నారాయణ బోయ రమాదేవి తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ ఎంవివి సత్యనారాయణ నుండి విశాఖను కాపాడుకుందాం

జనసేన కార్పొరేటర్ పీతల మూర్తి యాదవ్

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : సామాన్య ప్రజలు నుంచి అన్ని రకాల పన్నులు ముక్కుపిండి వసూలు చేస్తున్న మహావిశాఖ నగరపాలక సంస్థ టౌన్ ప్లానింగ్, రెవెన్యూ విభాగాలు అధికార పార్టీ పెద్దలను మాత్రం వదిలేస్తున్నాయని నగరం నడిబొడ్డున వివాదాస్పద సిబిసిఎన్‌సి స్థలంలో ఎటువంటి అనుమతులు లేకుండా మైనింగ్ జరుపుతూ ప్రాజెక్టుకు శంకుస్థాపన చేసి వ్యాపారాన్ని ప్రారంభించిన విశాఖ ఎంపీ ఎంవివి సత్యనారాయణ విషయంలో నగరపాలక సంస్థ మొద్దు నిద్ర నటిస్తోందని విశాఖ జనసేన కార్పొరేటర్ పితలమూర్తి యాదవ్ ఆగ్రహం వ్యక్తం చేశారు. శుక్రవారం టౌన్ ప్లానింగ్ స్పందనలో విశాఖ ఎంపీ ఎం వివి సత్యనారాయణ అక్రమాలపై ఫిర్యాదు చేశారు. నిబంధనలకు విరుద్ధంగా ఇక్కడ రెండు లక్షల క్యూబిక్ మీటర్లకు పైగా మైనింగ్ జరిగినా సంబంధిత శాఖ స్పందించడం లేదని మీడియా తో జివిఎంసి ఆఫీస్ వద్ద మాట్లాడారు. సిబిసి ఎన్ సి ఖాళీ స్థలానికి మూడు కోట్ల రూపాయల వరకు వేకంట్లాండ్ టాక్స్ ను భవన నిర్మాణదారు చెల్లించాల్సి ఉందని దాని గురించి ఎవరూ మాట్లాడటం లేదని. 14% ఓపెన్ స్పేస్ చార్జెస్ సుమారు 15 కోట్ల రూపాయలను ఇప్పటికీ వసూలు చేయలేదని ఆగ్రహించారు భూమి విలువపై రెండు శాతం ఇంపాక్ట్ ఫీజులు ఎంవివి సత్యనారాయణ చెల్లించాల్సి ఉందని తెలిపారు. విశాఖపట్నం పోర్ట్ స్టేడియం వెనుక మరో వైసీపీ నేత బొడ్డేటి కాశీ విశ్వనాథం నిర్మిస్తున్న బహుళ అంతస్తు నిర్మాణాల్లో పలు ఉల్లంఘనలు జరుగుతున్నాయని, అక్కడ నిర్మాణ స్థలానికి కూడా నిర్మాణదారుడు 33 లక్షల రూపాయల విఎల్‌టి చెల్లించలేదన్నారు.

విద్యుత్ కార్మికుల సమస్యలు పరిష్కరించాలంటూ నిరసన

విశాలాంధ్ర - రాజవొమ్మంగి : ఎన్నో ఏళ్లుగా నెలకొన్న తమ సమస్యలు ప్రభుత్వం తక్షణం పరిష్కరించాలని స్థానిక విద్యుత్‌శాఖ ఉద్యోగులు శుక్రవారం స్థానిక ఎపిఇపిడిసిఎల్ కార్యాలయం వద్ద నిరసన కార్యక్రమం చేపట్టారు, తమ డిమాండ్లు పరిష్కరించాలని బిగ్గరగా నినదించారు. ప్రభుత్వం తమ డిమాండ్లు పరిష్కరించకపోతే వచ్చే నెల 10 నుంచి సమ్మెకు దిగుతామని ఉద్యోగుల జెఎసి నాయకులు సురేష్ పేర్కొన్నారు. విద్యుత్ కార్మికుల నిరసనకు సిఐటియు జిల్లా నాయకులు పి రామరాజు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా రామరాజు మాట్లాడుతూ, నాణ్యమైన విద్యుత్ సరఫరా కోసం ఉద్యోగులు, కార్మికులు అహర్నిశలు శ్రమిసు _న్నారన్నారు, వారి సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం చొరవ చూపడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. కాంట్రాక్టు కార్మికులను పర్మినెంట్ చేయాలని,సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని అనేక మార్లు ప్రభుత్వానికి విన్నవించినా పట్టించుకోవడం లేదన్నారు, విద్యుత్ శాఖ సిబ్బంది రాంబాబు, చిట్టిబాబు, దొర తదితరులు మాట్లాడుతూ తమ సమస్యలను పరిష్కరించేంత వరకు ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో విద్యుత్ శాఖ సబ్ ఇంజనీర్ సురేష్ కుమార్,సిబ్బంది రాంబాబు, కిరణ్, చిట్టిబాబు, దొర, ప్రసాద్, చిన్న, రాఘవ, శివ,లోవ ప్రసాద్, గణేష్ తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ భూమిని లబ్ధిదారుడికి రిస్టోరేషన్ చేయాలి

విశాలాంధ్ర - పాయకరావుపేట : మండలంలోని కేశవరం రెవెన్యూ పరిధిలోని సర్వే నెంబరు 108/1బిలో ఉన్న 5ఎకరాల భూమిని రిస్టోరేషన్ చేసి గతంలో ప్రభుత్వం మంజూరు చేసిన లబ్ధిదారుడికే తిరిగి ఇవ్వాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తోటి చెంగలరావు, మాల మహానాడు రాష్ట్ర అధ్యక్షుడు దారా సురేష్ డిమాండ్ చేశారు. తహశీల్దార్ కార్యాలయం వద్ద స్థానిక విలేఖర్లతో మాట్లాడుతూ 5 ఎకరాల భూమిని గతంలో ప్రభుత్వం వేమగిరి నరసింహులుకు డిపట్టా పంపిణీ చేసిందన్నారు. నరసింహులు పదేళ్ల క్రితం మరణించాడని తెలిపారు. నరసింహులుకు భార్య, ముగ్గురు పిల్లలు ఉన్నట్లు తెలిపారు. అయితే 5 ఎకరాల భూమి వేమగిరి నరసింహులు భార్య సింహాచలంకు తెలియ కుండా రిజిస్ట్రేషన్లు జరిగిపోయాయని తెలిపారు. ఆన్‌లైన్‌లో కూడా పేర్లు మారిపోయాయని తెలిపారు. ఈ విషయమై జిల్లా కలెక్టర్, ఆర్‌డిఓలకు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. అధికారులు విచారణ చేసి రిజిస్ట్రేషన్లు, ఆన్‌లైన్‌లో పేర్లు మారిపోవడాన్ని గుర్తించారని తెలిపారు. ప్రస్తుతం 5 ఎకరాల భూమి ప్రభుత్వం స్వాధీనంలో ఉందని తెలిపారు. ఈ భూమిని తిరిగి వేమగిరి నరసింహులు భార్య వేమగిరి సింహాచలంకు అప్పగించాలని డిమాండ్ చేశారు. రెవెన్యూ అధికారులు భూమి అప్పగించకపోతే రాష్ట్రపతి, గవర్నర్‌లకు ఫిర్యాదు చేస్తామని హెచ్చరించారు. ఈ సందర్భంగా రెవెన్యూ అధికారులకు వినతిపత్రం అంద జేశారు. ఈ కార్యక్రమంలో దళిత గిరిజన జేఏసి నాయకులు మోకన అన్నవరం, ది ల్యాండ్ అండ్ లైవ్‌లీ లూజర్స్ ఫెడరేషన్ అధ్యక్షులు భూర్తి అప్పారావు, బిఎస్‌పి కాకినాడ జిల్లా అధ్యక్షులు మాతా సుబ్రమణ్యం తదితరులు పాల్గొన్నారు.

కాంటూరు 41 లిస్ట్‌లో కుమ్మూరు గ్రామాన్ని చేర్చాలి

విశాలాంధ్ర - దేవీపట్నం : చింతూరు మండల పరిధిలోని కుమ్మూరు గ్రామాన్ని పోలవరం కాంటూరు 41 లిస్ట్ లో చేర్చి శాస్త్రీయ సమగ్ర పునరావాసం కల్పించాలని ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ ఓ ప్రకటనలో డిమాండ్ చేశారు. కుమ్మూరు గ్రామాన్ని పోలవరం కాటూరు 41లిస్ట్ లో చేర్చాలని జలదీక్ష ద్వారా నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆదివాసీ జేఏసీ రాష్ట్ర వైస్ చైర్మన్ తెల్లం శేఖర్ మాట్లాడుతూ...గోదావరి నదికి ఎగువ ప్రాంతాల్లో కురుస్తున్న భారీ వర్షాలకు వరద నీరు వచ్చి చేరడంతో గోదావరి నదికి అనుకోని ఉన్న అనేక ఆదివాసీ గ్రామాలు 24 వేల కుటుంబాలకు అర్‌అండ్‌అర్ ప్యాకేజీ లేదు మరియు తరలింపు లేదు.పోలవరం జాతీయ ప్రాజెక్ట్ కోసం సర్వసం త్యాగం చేస్తే రోడ్డున పడేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. గత రెండు వారాలుగా గోదావరి వరద నీటిలో చింతూరు, వి.అర్.పురం, కూనవరం, ఎటపాక మండలాల ప్రజలు మరియు దేవీపట్నం మండల పరిధిలోని తాళ్లూరు గ్రామ ప్రజలు నేటికీ వరద నీటిలో ఉన్నారన్నారు. కేంద్రం నుండి పోలవరానికి నిధులు వరద వచ్చాయి అంటూ కాకి లెక్కలు చెబుతున్నారు తప్ప వాస్తవానికి ఏ ఒక్క నిర్వాసిత గ్రామానికి పూర్తి స్థాయిలో నష్ట పరిహారం అందిచలేదన్నారు. ఇప్పటికైన కాకి లెక్కలు మాని 2013 భూ సేకరణ చట్టం ప్రకారం పోలవరం జాతీయ ప్రాజెక్ట్ నిర్వాసితులందరికి శాస్త్రీయ సమగ పునరావాసం కల్పించాలి. అలాగే వరద బాధితులకు తక్షణమే నిత్యావసర వస్తువులు, చిన్న పిల్లలకు పాలు ప్యాకెట్లు, బరకాలు మరియు కిరోసిన్ పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు.

గర్భిణీ స్త్రీని ప్రభుత్వ ఆసుపత్రికి తరలింపు

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : మండలంలోని చిన్నమట్ట పల్లి గ్రామపంచాయతీ సర్పంచ్ పిట్ట రామారావు ఆధ్వర్యంలో చినమ్మటపల్లి పుల్లి. రాము లమ్మ నొప్పులతో ఉన్న గర్భిణీ స్త్రీని అడివివెంకన్న గూడెం నుండి తుష్టివారిగూడెం, చింతరేవుగుపల్లి, చినమ్మటపల్లి నిండు గోదావరి లో బోట్ మీద చేర్చి 108 మినీ అంబులెన్స్ ద్వారా ప్రభుత్వ ఆసుపత్రికి చేర్చినారు. ఇప్పటి వరకు రామవరం చినమ్మటపల్లి పంచాయతీ నుండి గర్భిణీ స్త్రీ లను మొత్తం 10 మందిని సేఫ్ జోన్ నకు ప్రభుత్వ ఆసుపత్రికి కోతులగుట్టలో చేర్చటం జరిగిందిఅని ఆయన అన్నారుఈ కార్యక్రమం లో వీఆర్వో వినోద్ కుమార్ తదితరులు పాల్గొన్నారు

తామరం పంచాయతీ పాలకవర్గం సమావేశం

విశాలాంధ్ర - మాకవరపాలెం : మాకవరపాలెం మండలం తామరం సచివాలయంలో శుక్రవారం పంచాయతీ పాలకవర్గ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సర్పంచ్ గొంతిన చెల్లారత్నం అధ్యక్షతన జరిగిన ఈ సమావేశంలో గ్రామంలో చేపట్టాల్సిన అభివృద్ధి పనులపై చర్చించారు. సచివాలయానికి భవనంతో పాటు రైతు భరోసా కేంద్రం సమకూరడంతో ప్రజలకు సేవలు సక్రమంగా అందుతున్నాయని సర్పంచ్ తెలిపారు. హెల్త్ క్లినిక్ కూడా పూర్తయిందని, త్వరలో ప్రారంభానికి చర్యలు తీసుకుంటామన్నారు.

బాలల హక్కుల పరిరక్షణకు ఎంఈఓ, సిఆర్ఎంటిలు కృషి చేయాలి

రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సీతారాం

విశాలాంధ్ర బ్యూరో - విశాఖపట్నం : బాలల హక్కుల పరిరక్షణలో మండల విద్యా శాఖాధికారులు, క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్లు పాత్ర కీలకమని ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు గొండు సీతారాం అన్నారు. విశాఖ నగర పర్యటనలో ఉన్న ఆయన శుక్రవారం అక్కయ్యపాలెం మునిసిపల్ ఎలిమెంటరీ స్కూలు పైభాగాన గల సీతమ్మ ధార ఎంఈఒ కార్యాలయంలో నగర ఎంఈఓలు, క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్లు వ్యవస్థలపై ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యులు సమీక్ష సమావేశం నిర్వహించారు. నగరంలోని ప్రభుత్వ, ప్రైవేటు, కార్పొరేట్ స్కూళ్ల వివరాలు అడిగి తెలుసుకున్నారు, ఆయా పాఠశాలల్లో మౌలిక సదుపాయలపైన, క్లస్టర్ రిసోర్స్ మొబైల్ టీచర్లు సంఖ్య,విధి విధానాలపై ఆరా తీశారు. నగరంలోని అన్ని మండల విద్యా శాఖాధికారులు వారి పరిధిలోని ప్రైవేటు, కార్పొరేటు స్కూళ్ల నోటీసు బోర్డులో ఫీజులు వివరాలు బహిర్గతం చేసేలా ఎటువంటి చర్యలు చేపట్టారో అడిగి తెలుసుకున్నారు. అలాగే ప్రతీ పాఠశాలలోని విద్యార్థిని విద్యార్థులు క్రీడా మైదానాల్లో ఆటలు ఆడేలా చర్యలు చేపట్టాలని అన్నారు. కొత్త స్కూల్ అనుమతులు మంజూరు చేసేటప్పుడు ఎటువంటి విధి విధానాలు పాటిస్తున్నారో సమాచారం సేకరించారు. ఈ సమీక్షలో సీతమ్మధార మండల విద్యాశాఖాధికారి డి.రామారావు, ఎం.ఈ.ఓ.2 బాలా మణి, వివిధ మండల విద్యాశాఖా దికారులు, చైల్డ్ డెవలప్మెంట్ ప్రోజెక్ట్ అధికారి శ్రీలత, జిల్లా బాలల సంరక్షణ అధికారి రమేష్, వార్డ్ ఎడ్యుకేషన్ సెక్రటరీలు, పి.శేఖర్ కే.ఎల్లయ్య, లవకుశ, ఎం.హరీష్ తదితరులు పాల్గొన్నారు.

వ్యవసాయ సాంకేతికతను అందుబాటులోకి తేవాలి

జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాథన్

విశాలాంధ్ర - విశాఖ కలెక్టరేట్ : జిల్లాలో వ్యవసాయ, అనుబంధ రంగాల రైతులకు సాంకేతికత అందుబాటులోకి తీసుకు రావాలని జాయింట్ కలెక్టర్ కె.యస్.విశ్వనాథన్ అధికారులను కోరారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన జిల్లాస్థాయి వ్యవసాయ సలహా మండలి సమావేశానికి ఆయన అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా జాయింట్ కలెక్టర్ మాట్లాడుతూ ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి విత్తనాలు, ఎరువులు రైతులకు ఆర్బికేల ద్వార నిత్యం అందుబాటులో ఉంచాలన్నారు. వరి కొనుగోలులో ఇబ్బందులు తలెత్తకుండా సక్రమంగా జరిగేలా అన్ని చర్యలు తీసుకోవాలని, దీనివల్ల రైతులకు ఎటువంటి నష్టం వాటిల్లకుండా ఉంటుందన్నారు. కౌలు రైతులకు పంట రుణాలు రెన్యువల్ చేసేందుకు తగిన చర్యలు చేపట్టాలని బ్యాంకు అధికారులను కోరారు. ఇటీవల అధిక వర్షాల వల్ల ముంపుకు గురై నష్టము వాటిల్లిన వరి నారులు యొక్క సమాచారము ప్రభుత్వమునకు నివేదిక పంపించాలన్నారు. జిల్లా వ్యవసాయ సలహా మండలి చైర్మన్ డివిఏ ప్రసాద్‌రాజు మాట్లాడుతూ భూసార పరిస్థితులను బట్టి అధిక దిగుబడినిచ్చే పంటలను, పాడి మత్స్య పరిశ్రమ లకు సంబంధించి సూచనలు సలహాలు అందించాలన్నారు. ప్రభుత్వ అందించే రాయితీను రైతులకు ఆర్బికే కేంద్రాల ద్వారా వర్తించే టట్లుగా అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి మండల, గ్రామ స్థాయిలో చర్చించిన విషయాలు ద్వారా వివరించారు. సమావేశంలో పశుసంవర్ధక శాఖ జెడి రామకృష్ణ , లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీనివాస్, పౌరసరఫరాల కార్పొరేషన్ డిఎం రాజేశ్వరి, ఉద్యానవన శాఖ అధికారి మన్మథరావు తదితర శాఖల అధికారులు పాల్గొన్నారు.

ఈసారైనా ప్రభుత్వం ఆదుకోవాలి

విశాలాంధ్ర - కూనవరం : 2022 గోదావరి వరదలు సృష్టించిన అపార నష్టం నుంచి కోలుకోకముందే మళ్లీ వరదలు చుట్టుముట్టడంతో తీవ్రమైన అభద్రతాభావం లో ఉన్న వరద బాధితులు ఈసారి ముందుగానే సురక్షిత ప్రాంతాలకు తరలి వెళ్ళిపోయారు. గోదావరి శబరి నదులు ఉప్పొంగి ప్రవహిస్తూ ఊరుని చుట్టుముట్టగానే కూనవరం ఊరు ఖాళీ అయిపోయింది మిగిలిన అతి కొద్ది సామాగ్రి తట్ట బుట్ట చేత పట్టుకొని బతుకు జీవుడా అంటూ ఎడ్లబండ్లపై పయనమైపోయారు. పోరావాస కాలనీలో చాలామంది ఎవరికి వారే తాత్కాలిక గుడారాలను ఏర్పాటు చేసుకొని పాములు విషపురుగుల మధ్య భయం గా గడుపుతున్నారు ఇదిలా ఉండగా గత ఏడాది వరద బాధితులను ఆదుకోవడంలో ప్రభుత్వం పూర్తిగా వైఫల్యం చెందింది ఇళ్లలో పేరుకుపోయిన వండ్రు మట్టిని తొలగించి ఇల్లు కడుక్కోవడానికి పదివేల నుంచి 50 వేల రూపాయల వరకు ఖర్చు అయింది కానీ ప్రభుత్వం 90 శాతం మంది వరద బాధితులకు కేవలం 2000 రూపాయలు ఇచ్చి సరిపెట్టింది. దీంతో నిరాసిక్తులు తీవ్ర నిరసనలు తెలియజేశారు ఇప్పుడు మళ్లీ అదే పరిస్థితి ఎదురవుతుందనే భయంతో బిక్కుబిక్కుమంటున్న వరద బాధితులు ఈసారైనా ప్రభుత్వం ఇస్తామంటున్న ఇంటికి పదివేల రూపాయలు నష్టపరిహారాన్ని పారదర్శకంగా అందరికీ అందేలా చూడాలని కోరుతున్నారు.

మావోయిస్టు వారోత్సవాలకు వ్యతిరేకంగా పోస్టర్లు



విశాలాంధ్ర - సీలేరు : అల్లూరి ఆదివాసి యువజన సంఘం పేరుతో సీలేరు, దారకొండ ప్రాంతాలలో మావోయిస్టు వారోత్సవాలపై పోస్టర్లు వెలిశాయి. దీనిలో ముఖ్యంగా గిరిజనుల అభివృద్ధిని అడ్డుకొని వారిని ఇన్‌ఫార్మర్ల నెపంతో హత్యలు చేసి వారికి కనీస మౌలిక సదుపాయాలైనటువంటి రోడ్లు, సెల్‌ఫోన్ టవర్ వంటి సదుపాయాలు రాకుండా చేసి అటువంటివారు మావోయిస్టు వారోత్సవాలు నిర్వహించడం గిరిజనులందరు వ్యతిరేకిస్తున్నట్లు అటువంటి వారికి ఎట్టి పరిస్థితుల్లో కూడా సానుభూతి చూపేది లేదని ఆ గోడపత్రికలో పేర్కొన్నారు.

ఎముకల వైద్యాధికారిగా బాధ్యతలు స్వీకరించిన సాయికృష్ణ

విశాలాంధ్ర - చింతపల్లి : స్థానిక ఏరియా ఆసుపత్రిలో ఎముకల వైద్యాధికారిగా సాయికృష్ణ శుక్రవారం బాధ్యతలు చేపట్టారు. గడచిన కొన్నేళ్లుగా ఈ ఆస్పత్రిలో ఖాళీగా ఉన్న ఈ ఎముకల వైద్యాధికారి నియామకానికి సంబంధించి అంతఃపురం గ్రామానికి చెందిన సాయి కృష్ణ మొట్టమొదటి నియామకం చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో వేయడంతో శుక్రవారం ఆయన అధికారికంగా బాధ్యతలు స్వీకరించారు. ఎముకల వైద్య నిపుణులుగా సాయి కృష్ణ విధుల్లో చేరడంతో చింతపల్లి ఏరియా ఆసుపత్రిలో ఎముకల వైద్యాధికారి లోటు తీరింది. పాడేరు కేంద్రంగా అల్లూరి సీతారామరాజు (మన్యం జిల్లా) పేరిట జిల్లా ఏర్పడడంతో పాడేరు తరువాత అంతటి ప్రాశస్త్యం కలిగిన చింతపల్లి ఏరియా ఆసుపత్రిని వంద పడకల ఆసుపత్రిగా నూతన ఆసుపత్రి భవన నిర్మాణం జరుగుతున్న విషయం తెలిసిందే. ఈ క్రమంలో ఏరియా ఆసుపత్రిలో అవసరమైన వైద్య నిపుణులను ప్రభుత్వం త్వరితగతిన నియమిస్తూ మన్య ప్రాంతానికి వైద్య సేవలను చేరువ చేస్తుంది.

వరద బాధితులకు నిత్యవసర సరుకులు ఇవ్వాలి

విశాలాంధ్ర - చింతూరు : వరద బాధితులకు నిత్యవసర సరుకులు ఇవ్వాలని సిపిఎం పార్టీ నాయకులు యర్రంశెట్టి శ్రీనివాసరావు, పల్లపు వెంకట్ డిమాండ్. చేశారు. శుక్రవారం కుమ్మూరు గ్రామంలో మరియు బోర్రాయి గూడెం గ్రామంలో పునరావాస కేంద్రాలను పరిశీలించారు. బాధితులు గత సంవత్సరం తీవ్రంగా నష్టపోయిన నేపథ్యంలో భయంతో గ్రామాన్ని చుట్టుముట్టడంతో పునరావాస కేంద్రాలకు వచ్చామని బాధితులు చెప్పారన్నారు. తామే స్వయంగా పాకలునిర్మించుకొని తామే బరకములు కొనుక్కొని వేసుకున్నామని బాధితులు చెప్పారన్నారు.గత సంవత్సరం కూడా బరకాములు అందరికీ ఇవ్వలేదని ఈ సంవత్సరం 2500 పెట్టి టార్పాలిన్లు కొనుక్కున్నామని బాధితులు తమ దృష్టికి తీసుకు వచ్చారన్నారు. ప్రభుత్వం ఇస్తే ఆ 2500 ఖర్చులకు ఉపయోగపడేవి అని వాపోయియినట్లు అన్నార న్నా రు.శుక్రవారం వరకు ఉప్పు ,పప్పు ,మంచి నూనె ఇతర నిత్యావసర వస్తువులు అందించలేదని చెప్పారు. కొవ్వొత్తులు గాని కిరోసిన్ గాని లేక చీకట్లోనే మగ్గుతున్నామని అన్నారు. పాకల్లో దోమలు బెడద తో నిద్ర పట్టడం లేదని అన్నారు. నీరు చుట్టుముట్టడంతో 254 కుటుంబాలు వారు ఖాళీ చేయడం జరిగిందని అన్నారు. నీళ్లు మునక్కుండా ఇల్లు మునక్కుండా ఎందుకు ఖాళీ చేశారని పై అధికారులు ప్రశ్నించుతున్నారని ఇది ఎక్కడ కర్మని బాధితులు వాపోతున్నారు. కనీసం చట్టి చింతూరు రావడానికి నిత్యవసరాలు తెచ్చుకోవడానికి బోటు ఏర్పాటు చేయలేదని అర్ధరాత్రి వరదొచ్చిన వెళ్లే దారి లేదని వారన్నారు. గతంలో వరద వస్తే బోటు ఏర్పాటు చేసే వారిని అన్నారు.అందుకే నీరు చుట్టుముట్టడంతో కాళీ చేశామని అన్నారు. ఒకవేళ కాళీ చేయకపోతే మమ్మల్నే తప్పు పడతారని బాధితులు చెప్పారు. కాబట్టి అధికారులు ప్రభుత్వం బాధ్యతగా వహించి మాకు నిత్యవసరాలు తక్షణమే అందించాలని డిమాండ్ చేశారు. సందర్శించిన వారిలో సిపిఎం నాయకులు ఎర్రం శెట్టి శ్రీనివాసరావు. పల్లపు వెంకట్ తదితరులు ఉన్నారు.

సమస్యలపై అధికారులను నిలదీసిన ప్రజాప్రతినిధులు

విశాలాంధ్ర - కోటవురట్ల : మండల పరిషత్ అధ్యక్షులు సింగంపల్లి అప్పల నాయుడు అధ్యక్షతన శుక్రవారం మండల పరిషత్ సమావేశ మందిరంలో జరిగిన సర్వ సభ్య సమావేశంలో సభ్యులు పలు సమస్యలపై అధికారులను నిలదీశారు. గత సమావేశంలో గుర్తించిన సమస్యల పరిష్కారానికి అధికారులు తీసుకున్న చర్యలను సమావేశంలో తెలియజేయాలని పట్టుపట్టారు. దీంతో గత తీర్మానాలను సభలో చదివి వినిపించారు. అనంతరం సభ ప్రారంభమై పంచాయతీరాజ్, ఆర్డబ్ల్యూఎస్, వైద్య, ఆరోగ్యం, విద్య, గృహనిర్మాణం, ఉపాధి హామీ పథకం, వెలుగు, రెవిన్యూ, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, పశు వైద్య శాఖ, విద్యుత్ శాఖ, శిశు సంక్షేమం, రోడ్డు రవాణా వంటి శాఖల పురోగతిపై చర్చించారు. కోటవురట్ల పెట్రోల్ బంకు పక్కన ఉన్న జగనన్న కాలనీ లోనికి వెళ్లడానికి సరైన రహదారి సౌకర్యం లేక లబ్ధిదారులు అనేక ఇబ్బందులు పడుతున్నారని ఎంపీటీసీ పీవీ సూర్యరావు అధికారులు నిలదీశారు. జగనన్న గృహాల పైన విద్యుత్ వైర్లు వేలాడి ఉండడం వల్ల లబ్ధిదారులు గృహాలకు శ్లాబ్ వేయడానికి ఇబ్బందికరంగా ఉంటుందని, విద్యుత్ వైర్లు తొలగించి లబ్ధిదారుల న్యాయం చేయాలని సర్పంచ్ అనిల్ కుమార్ అన్నారు. ఎంపీడీవో కార్యాలయం ఆవరణలో మరియు ఆర్ అండ్ బి రోడ్డు వద్ద వర్షపు నీరు నిల్వ ఉండడం వలన రాకపోకలకు తీవ్ర అంతరాయం కలుగుతున్నందున ఆర్ అండ్ బి శాఖ అధికారులు తగు చర్యలు తీసుకోవాలని సభ్యులందరూ కోరారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి ఉమాదేవి, ఎంపీడీవో, వైస్ ఎంపీపీ దత్తుడు సీత బాబు, సుజాత, తహసిల్దార్ జానకమ్మ, వివిధ శాఖలకు చెందిన అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచులు పాల్గొన్నారు.

వరద ముంపు బాధితులకు నిత్యా వసరాలు అందించాలి

విశాలాంధ్ర - వి.ఆర్.పురం : మండల కేంద్రమైన రేఖపల్లిలోనీ గుడారాలు వేసుకుని నివసిస్తున్న వరద ముంపు, బాధితులను, శుక్ర వారంజన సేన పార్టీ మండల అధ్యక్షుడు ము లకాల సాయి కష్ణ ఆధ్వర్యంలో ఆ పార్టీ నాయకులు పర్యటించి వరద బాధిత ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఆ నాయకులతో వరద బాధితులు మాట్లాడుతూ బియ్యం ఒక కేజి కందిపప్పు తప్పయే సహాయం అందలేదని తల దాచుకోడానికి పునరావాస కేంద్రాలు ఏమి లేవని, కనీసం గుడారాలు వేసుకుందామంటే టార్పాలిన్లు కూడా అందించలేదని వాపోయారు. పాములు, విషకీటకాలు తిరుగుతున్నాయని దోమల బాధ తట్టుకోలేకపోతున్నామని, కిరోసిన్ కానీ కొవ్వొత్తులు ఏమీ ఇవ్వలేదని రాత్రంతా భయంతో బతుకుతున్నామని వారు వాపోయారు ఈ సందర్భంగా జనసేన నాయకులు మాట్లాడుతూ చాలా చోట్ల గుడారాలు కర్రలతో కట్టి ఉన్నాయని టార్పలిన్‌లు కొనలేక దీనంగా చూస్తున్నారని వర్షంలో ఎక్కడ తలదాచుకోవాలో అర్థం కాని పరిస్థితి లో వరద బాధితులు ఉన్నారని అన్నారు. వరద బాధితులను ఆదుకునే విషయంలో ప్రభుత్వం పూర్తిగా విఫలమైందని వెంటనే నిత్యవసర సరుకులు, దోమతెరలు మరియు టర్పలిన్‌లు తక్షణమే పంపిణీ చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో మండల నాయకులు బాగుల అంజనరావు, శ్రీనివాస్ రెడ్డి, కళ్యాణ్, నాగేంద్ర, పవన్ తదితరులు పాల్గొన్నారు

శంకర్ ఫౌండేషన్ కంటి ఆస్పత్రిలో హై క్వాలిటీ ఎస్‌ఎస్-ఓసీటీ పరికరం

విశాలాంధ్ర -పెందుర్తి : జీవీఎంసీ 93వ వార్డు నాయుడుతోట, శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రిలో ఖచ్చితమైన రోగ నిర్ధారణల కోసం హై క్వాలిటీ ఎస్ఎస్-ఓసీటీ పరికరాన్ని ఏర్పాటు చేసారు. శంకర్ ఫౌండేషన్ సీనియర్ డాక్టర్ జగన్నాథ్ కుమార్ చల్లా ఈ కొత్త పరికరాన్ని శుక్రవారం ఉదయం ప్రారంభించారు. ఈ సందర్భంగా డాక్టర్ జగన్నాథ్ మాట్లాడుతూ చికిత్స ఎంపికలతో, ఈ ప్రాంతంలో అంధత్వ నివారణలో ప్రధాన పాత్ర పోషిస్తూ, రోగులకు అధిక నాణ్యమైన కంటి సంరక్షణ సేవలను అందించడములో భాగముగా అత్యాధునిక పరికరం ఎస్-ఎస్-ఓసిటిను కొనుగోలు చేసినట్లు తెలిపారు. ఈ పరికరం కంటి నిర్మాణాన్ని, ముఖ్యంగా కోరాయిడ్, రెటీనా, కార్నియా మొదలైన వాటిని ఇమేజింగ్ చేయడానికి ఉపయోగిస్తామని చెప్పారు. కంటి జబ్బులను గుర్తించడంలో రోగులను లోతుగా పరీక్షించడానికి, రోగనిర్ధారణ చేయుటకు ఈ పరికరము చాలా ఉపయోగపడుతోందని తెలియచేసారు. ఈ కార్యక్రమములో డాక్టర్ టి.రవీంద్ర, డాక్టర్ నస్రీన్, డాక్టర్ శిరీష, డాక్టర్ లక్ష్మి, డాక్టర్ కృష్ణతేజ, డాక్టర్ అన్నాజీరావు, డాక్టర్ శ్రావ్య, కె.రాధాకృష్ణన్ జీ.ఎం,కె.బంగార్‌రాజు డిప్యూటీ జనరల్ మేనేజర్, వి.రమేష్ కుమార్, డిజిఎం, శ్రీమతి ధరణి పాల్గొన్నారు.

గోదావరి ఉగ్ర రూపం

కొనసాగుతున్న రెండోవ ప్రమాద హెచ్చరిక

విశాలాంధ్ర - ఎటపాక : గోదావరి దొబుచులాడుతూ గురువారం తగ్గుముఖం పట్టి రాత్రి 11గంటల 45 అడుగులకు తగ్గుముఖం పట్టిన గోదావరి. శుక్రవారం ఉదయం 8 గంటల నుండి క్రమంగా పెరుగుతు 45 నుండి క్రమంగా పెరుగుతు శుక్రవారం సాయంత్రం నికి 51.50 అడుగులు చేరుకుంది. మారుమూరు, నందిగామ, తోటపల్లి, నెల్లిపాక జాతీయ రహదారి పై రోడ్డు పై వరద చేరడంతో కూనవరం నికి భద్రాచలం నికి రాక పోకలు నిలిచాయి. నంది గామ, మారు మూరు గౌరీదేవి పేట, గన్నవరం, నెల్లిపాక గ్రామాలు గోదావరి చుట్టుముట్టింది. దింతో లోతట్టు ప్రాంతాల వారు సురక్షిత ప్రాంతా లకు తరలి వెళ్తున్నారు. ఇంకా పునర వాసంలోనే ముంపు బాధితులున్నారు. ఎగువ నుండి వచ్చే వరద ను బట్టి మరింత గోదావరి పెరగవచ్చుని, లోతట్టు ప్రాంతాల వారు అప్రమత్తంగా ఉండాలని అధికారులు తెలుపుతున్నారు.

భూసేకరణలో అభ్యంతరాలపై గ్రామసభ

రైతులు తెలియకుండా భూసేకరణ చేయడంపై అభ్యంతరం

విశాలాంధ్ర బ్యూరో - అనకాపల్లి : అనకాపల్లి జోన్ పరిధిలో విలీన గ్రామమైన రాజుపాలెం వద్ద రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి నిర్మాణానికి సంబంధించి భూ సేకరణలో భూములు కోల్పో యిన రైతుల వద్ద నుంచి అభ్యంతరాలను తెలుసు కోవడానికి శుక్రవారం డిప్యూటీ తాసిల్దారు శ్రీరామ్మూర్తి గ్రామసభ నిర్వహించారు.రాజుపాలెం రెవిన్యూ సర్వే నెంబర్60, 61, 62, 63, 148 149 నెంబర్లలో జిరాయితి భూమిని సేకరిస్తు న్నట్లు, అభ్యంతరాలు ఉంటే తెలపమని భూములు కోల్పోతున్న రైతులు వివరాలను ప్రకటించారు. దీంతో ఆగ్రహం వ్యక్తం చేసిన రైతులు తమకు తెలియకుండా, సమాచారం ఇవ్వకుండా భూమిని ఎలా సేకరిస్తారని నిలదీశారు. ఈరోజు గ్రామసభ ఉందని ముందు రోజు రాత్రి వాలంటరీ ద్వారా సమాచారం ఇవ్వడం ఎంతవరకు సబబు అని ప్రశ్నించారు. భూసేకరణకు సహకరించాలంటే ఫ్లై ఓవర్ బ్రిడ్జ్ ఇరువైపులా బౌండరీస్ చూపించాలనీ, రైల్వే ఫ్లై ఓవర్ బ్రిడ్జి ప్లానింగ్ ని ముందుగా మాకు చూపించాలనీ. ఈ ఫ్లైఓవర్కు ఇరువైపులా బర్రెలు గ్రౌండ్‌కు, రైతులు, పాద చారులకు మేము పొలములోకి వెళ్లే పండిన పంటను వాహనాల ద్వారా ఇంటికి తెచ్చుకుని విధముగా రోడ్లను ప్లానింగ్ లో చూపించాలనీ, ఇప్పుడు ప్రస్తుతం ఏదైతే రోడ్డు ఉందో ఆ రోడ్డుకి సమాంతరంగా కుడివైపు ఎడమవైపు భూసేకరణ చెయ్యాలనీ, భూ సేకరణ చేసిన భూమి బాధితులకు ఇక్కడున్న మార్కెట్ వేల్యూ ప్రకారం ఉన్న ఇండ్ల స్థలాలను ఇప్పించాలనీ, గతంలో కూడా ఈ గ్రామాల నుండి భూసేకరణ చేసిన రైల్వే లైన్, వై ఎల్ ఎం సి, కాలువ, ఎన్ హెచ్ -5 రోడ్ల నిర్మాణంలో పోయిన వారికి ఎటువంటి జీవనోపాధి చూపించలేదనీ, ఇప్పుడైనా భూమి పోతున్న రైతులకు జీవన ఉపాధి చూపిస్తూ ఉద్యోగాలు కల్పించాలనీ, ముఖ్యంగా వర్షా దారంతో ఆధారపడి ఉన్న రైతుల పంట పొలాలు పండాలి అంటే ఇప్పుడు వేస్తున్నటువంటి ఫ్లై ఓవర్ బ్రిడ్జి కు దిగువన రాజుపాలెం రెవిన్యూ గ్రామం 61/10, 151,150,154, గెడ్డవాగులు, చెరువులు ఎఫ్ఎంబి ప్రకారం ఉన్నట్లుగా కప్పకుండా పిల్లర్స్ ద్వారా ఫ్లైఓవర్ వేయాలి. 150 సర్వే నెంబర్ లో ఉన్న బర్రెల గ్రౌండ్ ప్రస్తుతం ఎలాగైతే నిర్మాణంలో ఉందో అలాగే కట్టించి ఇవ్వాలనీ, ఈ ఫ్లైఓవర్ ప్లానింగ్ వేసి, భూమి కోల్పోతున్న రైతులకు నోటీసులను అందించి, మా భూములకు పోతున్న ఇల్లులకు ఎంత పారీ తోషకం ప్రభుత్వ రూల్ ప్రకారం ఇస్తున్నారో ఖిత పూర్వకంగా సదరు రైతులకు తెలియజేస్తూ, సంబంధిత అధికారుల అందరితో మరల గ్రామ సభను ఏర్పాటు చేసిన మా భూములు మేము స్వచ్ఛందంగా ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నాము అని డిమాండ్ చేశారు. లేనిపక్షంలో భూములు ఇచ్చే ప్రసక్తి లేదని సభ నుంచి లేచి వెళ్ళిపోయారు. సభలో మాజీ సర్పంచ్ కసిరెడ్డి సత్యనారాయణ, మాజీ ఎక్స్ ఎంపీటీసీ సిరిసిపల్లి సన్యాసిరావు, సచివాలయం కన్వీనర్ కరణం సురేష్, గైపూరి భాస్కరరావు, కసిరెడ్డి అప్పలకొండ, కసిరెడ్డి శ్రీనివాసరావు, అంజూరి కళ్యాణం, సిరసపల్లి, రాజుపాలెం, కొత్తూరు గ్రామ ప్రజలు, రైతులు పాల్గొన్నారు.